RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY తెలుగు దినపత్రిక

| మల్కాజిగిరి | సంపుటి : 3 | సంచిక : 146 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ | ఆదివారం,నవంబర్,30,2025 | పేజీలు : 8 వెల : రూ.4/- |
|---|---|---|---|---|---|
| MALKAJGIRI | VOLUME : 3 | ISSUE NO : 146 | EDITOR : MERUGU CHANDRAMOHAN | Sunday,November,30,2025 | PAGES : 8 RS : 4 /- |



## 16 ఏండ్ల క్రితం ఉద్యమాన్ని మలుపుతిప్పిన దీక్ష..

### ఆనాటి రోజులు గుర్తు చేసుకున్న కెటిఆర్, హరీష్

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** దీక్షా దివస్ సందర్భంగా తెలంగా ణ ఉద్యమం నాటి రోజులను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్మరించుకున్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక మలుపుగా నిలిచిన రోజు 2009 నవంబర్ 29 అని అన్నారు. రాష్ట్ర సాదనకు 16 ఏండ్ల క్రితం సరిగ్గా ఇదే రోజు నాంది పలికిందని అన్నారు. తెలంగాణ గమ్యాన్ని మార్చిన చారిత్రాత్మక రోజు అని తెలిపారు.కరీంనగర్‌లో కేసీఆర్‌ను అరెస్టు చేసిన సమయంలో ప్రజల్లో నుంచి వచ్చిన ఆగ్రహ జ్వాలలు తెలంగాణ ఉద్యమానికి కొత్త ఊపు ఇచ్చిందని కేటీఆర్ అన్నారు. ఈ మేర కు అప్పటి పరిస్థితులను గుర్తుచే స్తూ ఆనాడు కరీంనగర్‌లో తీసిన వీడియోను సోషల్ మీడియాలో పంచుకున్నారు. అలాగే దీక్షా దివస్ సందర్భంగా తెలంగాణ ఉద్యమం నాటి రోజులను బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు గుర్తుచేసుకున్నా రు. 'తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో' నినాదంతో 2009 నవంబర్ 29న ప్రారంభించిన ఆమరణ దీక్ష, ఉద్యమ గతిని మలుపు తిప్పిందని.. సరికొత్త చరిత్రకు నాంది పలికిందని.. తెలంగాణ ఏర్పాటుకు బాటలు వేసిందని తెలిపారు.



## కర్ణాటకలో మళ్లీ రాజకీయ సెగ

- కాంగ్రెస్ అధిష్టానం ఆదేశంతో సిద్దుతో డికె భేటీ
- ఇరువురు నేతలు బ్రేక్‌ఫాస్ట్ చర్చలు
- 2028లో గెలుపు కోసం చర్చించామని వెల్లడి

బెంగళూరు,నవంబర్29 : కర్ణాటక సీఎం కుర్చీ కోసం సమరం వేళ కాంగ్రెస్ అధిష్ఠానం ఆదేశాల మేరకు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌లు శనివారం బ్రేక్‌ఫాస్ట్ చేసేందుకు ఒక్కచోట కలిశారు. ఇక్కడ ఇద్దరు నేతల మధ్య సయోధ్య కుదిర్చేం దుకు కాంగ్రెస్ నానా తంటాలు పడుతోంది. ఎట్టకేలకు కర్నాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఆ రాష్ట్ర డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ మధ్య శనివారం ఉదయం బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్ జరిగింది. దీనికి సంబంధించి డీకే శివకుమార్ ఎక్స్‌లో పోస్ట్ కూడా చేశారు. ఉదయం బెంగళూరులోని కావేరి నివాసంలో అల్పాహార సమావేశం కోసం ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను కలిశానని డీకే చెప్పారు. కర్ణాటక ప్రాధాన్యతలు, ముందుకు సాగాల్సిన మార్గాలపై ఫలప్రదమైన చర్చ జరిగిందని వెల్లడించారు.అయితే, డీకే శివకుమార్ తన ఎక్స్ సందేశంలో తెలుపనప్పటికీ సీఎం సిద్దరామయ్యతో టీపార్టీ మీటింగ్ ముఖ్యంగా రొటేషనల్ సీఎం ఒప్పం దంపై చర్చించుకునేందుకే నన్నది అందరికీ తెలిసిన విషయమే. కాంగ్రెస్ అధిష్టానం ఆదేశాల మేరకే ఇరువు రు నేతలు టీపార్టీ మీటింగ్ పేరిట కలుసుకుని మాట్లా డుకున్నట్టు సమాచారం.ఇలా ఉండగా, 2023లో కర్నా టకలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత, ఎవరు రాష్ట్రానికి సీఎం కావాలన్న ప్రశ్న ఉదయించింది. అయితే, అధిష్టానం సూచన మేరకు ఇరువురు నేతలు రొటేషనల్ ఒప్పందం ప్రకారం ముఖ్యమంత్రిగా వ్యవహ రించలన్న ఒప్పందం జరిగింది. దీంతో సిద్దారామయ్య సిఎంగా, శివకుమార్ డిప్యూటీగా నియమితులయ్యారు. ఇప్పుడు, ఆయా కాలం పూర్తయ్యే సమయంలో, ఈ ఒప్పందం మళ్లీ తెరమీదకి వచ్చింది.



## రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ దీక్షా దివస్

- సిద్దిపేటలో హరీష్ రావు బైక్ ర్యాలీ
- తెలంగాణ భవన్‌లో కెటిఆర్ నివాళి

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణులు దీక్షా దివస్‌ను ఘనంగా జరుపుకున్నారు. సిద్దిపేటలో అంబేద్కర్ విగ్రహానికి హరీశ్‌రావు పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం నగరంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి,ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్, యాదవరెడ్డి పాల్గొన్నారు. హైదరాబాద్‌లోనూ దీక్షా దివస్‌ను ఘనంగా జరుపుకున్నారు. తెలంగాణ భవన్‌కు భారీగా బీఆర్ఎస్ శ్రేణులు తరలివచ్చాయి.






## రేవంత్ సొంతూరులో సర్పంచ్ ఏకగ్రీవం

### పోటీచేసే వారి నుంచి ఒకరిని ఎన్నుకోవాలని నిర్ణయం

**కొడంగల్,తెలంగాణ దిశ :** సీఎం రేవంత్ రెడ్డి స్వగ్రామం కొండారెడ్డిపల్లె సర్పంచ్ ఏకగ్రీవమైంది.. ఎస్సీకి రిజర్వ్ అయిన కొండారెడ్డిపల్లె సర్పంచ్ పదవికి 15 మంది పోటీ పడ్డారు. చివరికి సర్పంచ్ ఎన్నికను గ్రామ పెద్దలు ఏకగ్రీవం చేశారు.. 15 మందిలో ఒకరి పేరును సీల్డ్ కవర్‌లో ప్రకటిం చనున్నారు. ఎవరి పేరు వచ్చినా గ్రామంమొత్తం సమిష్టిగాఆ నిర్ణయాన్ని గౌరవించాలనేది గ్రామ నాయకత్వం అభిప్రాయంగా చెబుతున్నారు. మరోవైపు.. మొదటి విడత పంచాయతీ ఎన్నికల నామినేషన్ల గడువు నేటితో పూర్తయ్యింది. ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు స్వీకరించినట్టు అధికారులు తెలిపారు. గురువారం నుంచి నామినేషన్లు స్వీకరిస్తుండగా శుక్రవారం సర్పంచి పదవులకు 4,901 నామినేషన్లు వచ్చాయి. దీంతో మొత్తం నామపత్రాల సంఖ్య 8,198కి చేరింది. అటు మొన్న, నిన్న కలిపి వార్డు సభ్యులకు 11,502 నామినేషన్లు దాఖలైనట్టు అధికారులు వెల్లడించారు. తొలి విడతలో 4,236 సర్పంచ్, 37,440 వార్డులకు ఎన్నికలు జరగనున్నా యి. నామినేషన్ల ఉపసంహరణకు చివరి తేదీ డిసెంబర్ 3. డిసెంబర్ 11న మొదటి దశ ఎన్నికలు జరుగుతాయి. ఉదయం 7 గంటల నుండిమధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ జరుగుతుంది, అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుండి ఓట్ల లెక్కింపు జరుగుతుంది



## ఎనర్జీ ఉంటేనే పెట్టుబడులు

- స్టోరేజీకి అనుగుణంగా గ్రీన్ ఎనర్జీ
- 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ ఎకానమీ టార్గెట్
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క


**హైదరాబాద్,తెలంగాణ దిశ :** గ్రీన్ ఎనర్జీ.. దేశ, ఆయా రాష్ట్రాల అభివృద్ధికి చాలా అవసరమని తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా గ్రీన్ ఎనర్జీ అనే చర్చ జరుగుతుందని అన్నారు. పారిస్ లో జరిగిన అగ్రిమెంట్ ప్రకారం అభివృద్ధి చెందుతున్న దేశాల్లో 50 శాతం తప్పకుండా గ్రీన్ ఎనర్జీ ఉ ండాలని అగ్రిమెంట్ చేసిన విషయాన్ని ఆయన ఈ సందర్భంలో గుర్తు చేశారు. తెలంగాణ భవిష్యత్ విద్యుత్ అవసరాలకు ప్రణాళికలు సిద్ధం చేశామని, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ ఎకానమీ టార్గెట్‌తో తెలంగాణ ముందుకు పోతుందని భట్టి వెల్లడించారు. తెలంగాణ ప్రపంచ దేశాలతో పోటీ పడే విధంగా తీర్చి దిద్దుతున్నామని, హైదరాబాద్ గ్లోబల్ హబ్ కాబోతోందని భట్టి తెలిపారు. 2047 వరకు మూడు ట్రిలియన్‌ల ఎకానమీకి చేరుకోవా లనేది లక్ష్యమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. అందుకు కావలసిన పెట్టుబడులకు అవసరమైనది విద్యుత్ అన్నారు. అనుకున్న లక్ష్యం చేరుకోవడానికి ప్లానింగ్ చేస్తున్నాం.. పవర్ డిమాండ్ రాష్ట్రంలో పదేళ్లుగా పెరుగుతుందని తెలిపారు. తాజాగా ప్రజా భవన్‌లో పవర్ పాయిం ట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.. 2014 నుంచి విద్యుత్తు 14.2 డిమాండ్ గ్రోత్ ఉందన్నారు.. 2020 - 2021 నుంచి 5.44 గ్రోత్, 2024- 25లో 9.8 శాతం గ్రోత్ కనిపించిందని వెల్లడించారు. 2025 నుంచి 34, 35 వరకు తెలంగాణలో 6.4 గ్రోత్ ఉండే అవకాశం ఉందని స్పష్టం చేశారు.



## పక్కదారి పడుతున్న రేషన్ బియ్యం

### పక్కదారి పడుతున్న రేషన్ బియ్యం

**ఆళ్లపల్లి,తెలంగాణ దిశ :** మండల పరిధిలో రేషన్ బియ్యం పక్క దారి పడుతున్నట్టు సమాచారం. ప్రధానంగా రూ. 10 నుంచి రూ. 15 వరకు కొనుగోలు చేస్తున్నట్టు సమాచారం. ఇదే అదునుగా ఏజెన్సీ ప్రాంతమైన ఆళ్లపల్లి మండలంలో గ్రామాలలో రేషన్ మాఫియా తిరుగుతూ ఒక చోట రేషన్ బియ్యాన్ని స్టోరేజ్ చేసి బొలెరో, ఆటోలలో, అర్ధరాత్రి సమయాల్లో తరలిస్తున్నట్లు మండల వాసులు గుసగుసలాడుతున్నారు. నిరుపేదలకు ప్రభుత్వం ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తున్న రేషన్ మాఫియా ఆరు కాయలు.. మూడు పువ్వుల్లాగా వారి వ్యాపారం కొనసాగిస్తూ, లక్షలు గడిస్తున్నారు. రేషన్ షాప్ లో బియ్యం తీసుకోవడమే తరువాయి, మరుసటి రోజు నుంచి లబ్ధిదారుల దగ్గరికి వెళ్లి కొనుగోలు చేస్తున్నట్లు సమాచారం.అర్ధరాత్రి 12 గంటల నుంచి ఉదయం 3 గంటల వరకు రేషన్ మాఫియా బియ్యం తరలించడానికి రెడీగా ఉంటారని తెలుస్తోం ది. వాస్తవానికి రేషన్ బియ్యం అక్రమ రవాణా అనేది చట్ట విరుద్ధం. పేదలకు సరఫరా చేయాల్సిన బియ్యాన్ని తరలించడం నేరం. నిలువ చేసిన బియ్యాన్ని ఆటోలు, మినీ వ్యాన్లు, బొలెరో వాహనాలలో వేరే రాష్ట్రాలకు తరలిస్తున్నట్లు సమాచారం. ఈ అక్రమ రవాణాలను అడ్డుక ట్ట వేయాల్సిందిగా మండల వాసులు కోరుకుంటున్నారు.



- గ్లోబల్ సమ్మిట్ పేరుతో రియల్ వ్యాపారం
- సిఎం రేవంత్‌పై సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ ఆరోపణలు

సిద్దిపేట, : గ్లోబల్ సమ్మిట్ పెట్టి భూములు అమ్ముకునేందుకు రేవంత్‌రెడ్డి ప్లాన్ చేస్తున్నారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రె డ్డిపై మాజీమంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. కేవలం రియల్ వ్యాపరమం కోసమే ఈ సమ్మిట్ అని ఆరోపణలు చేశారు. సిద్దిపేటలో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడుతూ.. నవంబర్ 29వ తేదీ ఒక చరిత్ర.. ఉద్యమాన్ని మలుపు తిప్పిన రోజు ఇదని చెప్పకొచ్చారు. ఉద్యమానికి సిద్దిపేటకు అవినాభావ సంబంధం ఉందని గుర్తుచేశారు. సిద్దిపేటలో జరిగిన ఉద్యోగుల గర్జన ఒక చరిత్ర అని వివరించారు.

## భూములు అమ్ముకునే కుట్ర

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** బీఆర్ఎస్ నేతలు కవిత అటెన్షన్ కోసం తమపై ఆరోపణల చేస్తూ ఉంటారని అంటూ ఉంటారు . కానీ రాజకీయాల్లో ఎప్పుడూ ఎలా చర్చనీయాంశమయ్యాలో మాట్లాడకుండానే తన వ్యూహం అమలు చేయగల తెలివైననేత. ఇప్పుడు అంతా ఆమె గురించే చర్చజరుగుతోంది. తెలంగాణ జాగృతి అధినేత కల్వకుంట్ల కవిత ధరించిన తెలుపు చీరపై సోషల్ మీడియాలో జోరుగా చర్చ జరుగుతోంది. ఎరుపు-ఆకుపచ్చ రంగుల డిజైన్ బోర్డర్‌తో అలంకరించిన ఈ చీర, కాంగ్రెస్ పార్టీ కండువా తెలుపు, ఎరుపు, ఆకుపచ్చ ను గుర్తుచేస్తూ ఉ ండటంతో అందరూ ఈ అంశంపై చర్చించడం ప్రారంభించారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కుమారుడి నిశ్చితార్థ వేడుకకు హాజరైన కవిత చీర ఎంపికే రాజకీయ సంకేతమా అని ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. అభిమానులు 'కాంగ్రెస్‌కు మద్దతు' అంటూ విమర్శలు గుప్పిస్తుంటే, కొందరు ఇది సాధారణ జాతీయ రంగుల చీర మాత్రమే అని కౌంటర్ ఇస్తున్నారుతెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కుమారుడు సూర్య విక్రమాదిత్య-సాక్షి దంపతుల నిశ్చితార్థ వేడుక మంగళవారం రాత్రి హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో ఘనంగా జరిగింది.

తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుటుంబ సభ్యులు, మెగాస్టార్ చిరంజీవి వంటి సెలబ్రిటీలు సహా పలువురు రాజకీయ, సినీ ప్రముఖులు హాజరయ్యారు. భర్తతో కలిసి కవిత వేడుకు వచ్చారు. కాబోయే దంపతులను ఆశీర్వదించారు.



## ట్రెండింగ్ లో కవిత..

## కాంగ్రెస్ రంగుల చీరతో ప్రత్యక్షం

# హెచ్ఐవి, ఎయిడ్స్ పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలి

## - జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ ఉమా గౌరీ








**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, నవంబర్ 29, (తెలంగాణ దిశ)** :ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం మేడ్చల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నీలిమ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, అనురాగ్ యూనివర్సిటీ సహకారంతో అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఉమా గౌరి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో టీబీ, హెచ్ ఐ వి అండ్ ఎల్ ఈ పి ప్రోగ్రాం అధికారిని డాక్టర్ శ్రీదేవి జిల్లాలో చేపడుతున్న కార్యక్రమాలు హెచ్ఐవి, ఎయిడ్స్ స్థితి గురించి వివరించారు. కళాశాల డీన్ డాక్టర్ ఎలక్షన్ ప్రసన్న మాట్లాడుతూ, జిల్లా వైద్య ఆరోగ్య ఆధ్వర్యంలో హెచ్ఐవి, ఎయిడ్స్ పై అవగాహన కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్య అతిధి డాక్టర్ ఉమాగౌరీ మాట్లాడుతూ విద్యార్థులందరూ మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా హెచ్ఐవి, ఎయిడ్స్ పై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఆరోగ్యం



పట్ల అవగాహన కలిగి ఉండాలని, కమ్యూనిటీ స్థాయిలో అందరికి విస్తృతంగా హెచ్ఐవి, ఎయిడ్స్ పట్ల అవగాహన కల్పించాలని కోరారు. అపుడే జిల్లాలో ఎయిడ్స్ బారిన పడేవారి సంఖ్య తగ్గించగలమని అన్నారు. ఈ అవగాహనా విషయంలో ఫీల్డ్ సిబ్బంది, ఐసీటీసీ, స్వచ్ఛంద సంస్థలు సేవలు అభినందనీయమని అన్నారు. ఈ సందర్భంగా హెచ్ఐవి ఎయిడ్స్ పై అవగాహన పోస్టర్ మేకింగ్, పోటీల్లో విజేతలైన ఐ సి టిసిస్టాప్ తో పాటు ఎన్జీఓస్ కు మొమెంటోస్, సర్టిఫికెట్స్ తో సత్కరించారు. చివరగా హెచ్ఐవి ఫ్రీ ఇండియా అనే ప్రతిజ్ఞతో ఐఈసీ ఎగ్జిబిషన్ స్టాల్స్ ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సత్యవతి, డాక్టర్ లావణ్య, వసంత, శోభన, సింహరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ ఎలిమినేటి కృష్ణారెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసిన బిఆర్ఎస్ నేతలు



భువనగిరి పట్టణంలోనిమాజీ ఎమ్మెల్సీ ఎలిమినేటి కృష్ణారెడ్డి నివాసాంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు చింతల వెంకటేశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బూడిద బిక్షమయ్య గౌడ్, మాజీ జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసారు. ఈ కార్యక్రమంలో భువనగిరి సింగిల్ విండో చైర్మన్ నోముల పరమేష్ రెడ్డి బిఆర్ఎస్ జిల్లా నాయకులు కుతాడి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

- (భువనగిరి, తెలంగాణ దిశ)

# ఎస్సీ ఎస్టీలకు న్యాయం జరిగే వరకూ పోరాడుతాం

## - ఎస్సీ, ఎస్టీ తెలంగాణ రాష్ట్ర కమీషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య






**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, నవంబర్ 29, (తెలంగాణ దిశ)** :ఎస్సీ, ఎస్టీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడడమే కాకుండా వారికి న్యాయం జరిగే వరకూ పోరాడుతామని ఎస్సీ, ఎస్టీ తెలంగాణ రాష్ట్ర కమీషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. కూకట్ పల్లి మండలంలోని మూసాపేట్ దాయరగూడలో సర్వే నెంబర్ 155లో కబ్జాఐన దళితుల స్థలాన్ని చైర్మన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితులకు న్యాయం జరిగే వరకూ అండగా ఉంటామని, అన్ని విధాల సహకరిస్తామని అన్నారు. కోర్టు కేసులో ఉన్న భూ వివాద స్థలాన్ని హైడ్రా అధికారులు దౌర్జన్యంగా కబ్జా చేసి ఫెన్సింగ్ వేశారని ఎస్సీ, ఎస్టీ బాధితులు కమిషన్ చైర్మన్ కు విన్నవించుకున్నారు. చైర్మన్ స్పందిస్తూ 50, 60 సంవత్సరాల నుండి ఉంటున్న వారి పూర్వీకులు స్థలాన్ని కోర్టులో కేసు నడుస్తున్నప్పటికీ హైడ్రా అధికారులు దౌర్జన్యంగా స్థలాన్ని కబ్జా చేయడం అన్యాయం అన్నారు. దళితులకు అన్యాయం చేసే వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని అన్నారు. హైడ్రా, హెచ్ఎండిఏ అధికారులకు నోటీసులు పంపుతామన్నారు. వైలెన్స్ ఆఫ్ ఎస్సీ ఎస్టీ కేసులు నమోదు చేస్తామని అన్నారు. బాధితులకు ఎలాంటి నోటీసులు, నష్ట పరిహారం ఇవ్వకుండా స్థలాలను కబ్జా చేసి ఫెన్సింగ్ వేసినందుకు సంబంధిత అధికారులకు నోటీసులు పంపుతామన్నారు. బాధితులకు న్యాయం జరిగే వరకూ అండగా ఉంటామని వారి భూమిని వారికి ఇప్పిస్తామని చైర్మన్ భరోసా ఇచ్చారు. ఈ పర్యటనలో మల్కాజిగిరి ఆర్డీఓ శ్యాంప్రకాష్, జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి వినోద్ కుమార్, జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ అధికారి పద్మజ, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# దీక్ష దివాస్ సందర్భంగా కెసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం





**భువనగిరి, నవంబర్ 29, (తెలంగాణ దిశ)** :యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన బి పార్టీ దీక్ష దివస్ కార్యక్రమంలో మాజీ మంత్రి సూర్యాపేట ఎమ్మెల్యే గుంతకండ్ల జగదీష్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు చింతల వెంకటేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసారు. అనంతరం వారు మాట్లాడుతూ దీక్ష దివస్ అంటేనే చరిత్ర అని అన్నారు. 2009 నవంబర్ 29న మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేపట్టిన దీక్ష దివస్ తోనే చరిత్ర మలుపు తిరిగిందన్నారు. తెలంగాణ రాష్ట్రం కోసం మన ఉద్యమ నేత చావో రేవో అంటూ సమరశఖం పూరించిన రోజు అని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధనకు దీక్ష దివాస్ తోనే బీజం పడిందన్నారు. ఒక్క బక్క పలుచని వాడి దీక్ష యావత్ తెలంగాణను ఏకం చేసిందన్నారు. డీల్లీ కోటలను బద్దలు కొట్టి, ఆంధ్రా నాయకుల కుట్రలను తిప్పి కొట్టిందన్నారు. దేశమే తెలంగాణ దిక్కు చూసేలా చేసిందన్నారు. చివరికి తెలంగాణను తెచ్చి పెట్టిందన్నారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు ఫైళ్ల శేఖర్ రెడ్డి, గదరా కిషోర్, బూడిద బిక్షమయ్యగౌడ్, గొంగిడి సునీత మహేందర్ రెడ్డి, కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ ఎలిమినేటి సందీప్ రెడ్డి, మాజీ మండల అధ్యక్షులు, మాజీ జెడ్పీటీసీలు, మాజీ ఎంపీపీలు, మాజీ సర్పంచులు మాజీ మున్సిపల్ ఛైర్మన్లు, మాజీ మున్సిపల్ కౌన్సిలర్స్, గ్రామ శాఖ అధ్యక్షులు, సింగిల్ విండో చైర్మన్ లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# శ్రీ సరస్వతీ శిశు మందిర్ లో జిల్లా స్థాయి ఖేల్ ఖూద్ పోటీలు







**కుషాయిగూడ, నవంబర్ 29, (తెలంగాణ దిశ)** :కుషాయిగూడలోని శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాలలో శనివారం జిల్లా స్థాయి ఖేల్ ఖూద్ స్పర్థలు నిర్వహించారు. కుషాయిగూడ, ఉప్పల్, ఆల్విన్ కాలనీ, శ్రీనివాస్ నగర్, కూకట్ పల్లి, దుండిగల్, ఫతేనగర్ పాఠశాలల నుండి రెండు వందల మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని కుషాయిగూడ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్ స్పెక్టర్ ఎల్. భాస్కర్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు క్రీడా స్పూర్తితో ఉండాలన్నారు. శ్రీ సరస్వతీ శిశు మందిర్ విద్యార్థులు క్రమశిక్షణతో పాటు అన్ని రంగాలలో ముందుంటారని కొనియాడారు. ఈ క్రీడా పోటీలలో కబడ్డీ, ఖోఖో, రన్నింగ్, లాంగ్ జంప్ పోటీలు నిర్వహించారు. జిల్లా స్థాయిలో గెలుపొందిన విద్యార్థులు డిసెంబర్ 12, 13 తేదీలలో జరిగే భాగ్యనగర్ విభాగ్ స్థాయి పోటీలలో పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో సబ్ ఇన్ స్పెక్టర్లు వెంకన్న, సుధాకర్ రెడ్డి, విజయ్, శ్రీ సరస్వతీ విద్యాపీఠం మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షులు ధూళిపాళ కాశి విశ్వనాథం, కార్యదర్శి భగవంత్ చారి, పాఠశాల కమిటీ సభ్యులు కెవివి. సత్యనారాయణ, వినోద్, అనూప్, మల్లికార్జున రెడ్డి, పాఠశాల ప్రధానాచార్యులు రాధిక, ఆచార్యులు విద్యార్థులు పాల్గొన్నారు.

# డీసీసీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ కు అభినందనల వెల్లువ






**మల్లాపూర్, నవంబర్ 29, (తెలంగాణ దిశ)** :కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నూతన అధ్యక్షులుగా నియమితులైన తోటకూర వజ్రేష్ యాదవ్ ను గ్రేటర్ సీనియర్ నాయకులు నెమలి అనిల్ కుమార్ బోడుప్పల్ లోని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షులు వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ జిల్లాలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడానికి అందరు కలిసికట్టుగా పని చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ డివిజన్ ప్రధాన కార్యదర్శి తాండ్ర శ్రీకాంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మక్తాల బాలరాజ్ గౌడ్, కోయలకొండ రాజేష్, డివిజన్ సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్, లక్ష్మీపతి, సురేష్ గౌడ్, మల్లాపూర్ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వంగవీటి ప్రిన్కు, కాంగ్రెస్ మహిళా నాయకురాళ్లు శ్రావణి గౌడ్, నజ్మా, ఇష్రాత్ భానో, రఘు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలి

## - అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, నవంబర్ 29, (తెలంగాణ దిశ)** :జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ డి విజయేందర్ రెడ్డి అధికారులకు సూచించారు. శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పౌర సరఫరాల జిల్లా మేనేజర్ ఎల్. సుగుణబాయి, డీఎస్ఓ శ్రీనివాస్ రెడ్డి, డిసిఓ వెంకట్ రెడ్డి, ఎఓ అధికారులు తో కలిసి కొనుగోలు కేంద్రాల ఇంచార్జ్‌లతో సమావేశమయ్యారు. ప్రస్తుత కొనుగోలు పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ట్యాబ్ ఎంట్రీలపై సమీక్ష చేపట్టారు. కొనుగోలు కేంద్రాల ఇంచార్జ్‌లు బాధ్యతాయుతంగా వ్యవహరించి, కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ముఖ్యంగా ట్యాబ్ ఎంట్రీలు ఆలస్యమవ్వడం వల్ల రైతుల చెల్లింపులు ప్రభావితమవుతున్నందున ప్రతి ఎంట్రీను అదే రోజు పూర్తి చేయాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ఏ కేంద్రంలోనైనా నిర్లక్ష్యం లేదా అజాగ్రత్త ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదే విధంగా రైతులకు చెల్లింపులు 48 గంటల్లోపు పూర్తిచేయడం తప్పనిసరి స్పష్టం చేశారు. ఇందుకు అవసరమైన అన్ని చర్యలను వెంటనే అమలు చేయాలని ఇంచార్జ్‌లకు సూచించారు. రైతులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ధాన్యాన్ని అమ్ముకునేలా, ప్రతి కేంద్రం సమర్థవంతంగా పనిచేయాలని ఆయన స్పష్టం చేశారు.



# సోలీస్ ఐ హాస్పిటల్‌కు 'ది టైమ్స్ ఆఫ్ ఇండియా' ప్రతిష్ఠాత్మక అవార్డు






**హైదరాబాద్, నవంబర్ 29, (తెలంగాణ దిశ)** : అత్యుత్తమ నేత్ర చికిత్స సేవలు, ఆధునిక వైద్య సదుపాయాలు, రోగుల పట్ల సేవాభావానికి గుర్తింపుగా సోలీస్ ఐ హాస్పిటల్‌కు 'ది టైమ్స్ ఆఫ్ ఇండియా' ప్రతిష్ఠాత్మక హెల్త్‌కేర్ ఎక్సలెన్స్ అవార్డు లభించింది. నగరంలో అగ్ర శ్రేణి కంటి ఆసుపత్రులలో ఒకటైన సోలీస్ ఈ అవార్డును సొంతం చేసుకోవడం వైద్య రంగంలో విశేషం. అత్యాధునిక లేసిక్, కాటరాక్ట్, కార్నియా, రెటినా వంటి చికిత్సలు ప్రపంచ స్థాయి ప్రమాణాలతో అందిస్తూ రోగుల నమ్మకాన్ని గెలుచుకున్నందుకు ఈ అవార్డు ప్రకటించినట్లు నిర్వాహకులు తెలిపారు. సోలీస్ ఐ హాస్పిటల్ వైద్యుల నైపుణ్యం, సేవా ధృక్పథం, అత్యుత్తమ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఎన్నో క్లిష్టమైన కేసులను విజయవంతంగా నిర్వహించడం వంటి అంశాలు ఎంపికలో ప్రధాన పాత్ర పోషించాయి. ఈ సందర్భంగా సోలీస్ ఐ హాస్పిటల్ ఎండీ నందనం పాటి రామాంజనేయులు (రాము) మాట్లాడుతూ ఈ అవార్డు మా సేవలకు లభించిన గొప్ప గుర్తింపు అని అన్నారు. రోగుల కోసం మరింత ఆధునిక సదుపాయాలను, అత్యుత్తమ చికిత్సను అందించేందుకు ఇది మాకు ప్రేరణగా పనిచేస్తుందని తెలిపారు. ఇప్పటికే ఆవోపా వారి వైశ్య రత్న అవార్డు, ప్రపంచ వ్యాప్తంగా వేల మందికి ఉపాధి కల్పిస్తున్న ఇంకా ఎన్నో బిరుదులు, అవార్డులు ఆయన స్వీకరించారు. తొమ్మిది సంవత్సరాల క్రితం హైదరాబాద్ ఈసీఐఎల్ లో సోలీస్ ఐ హాస్పిటల్ ను ప్రారంభించారు. అన్ని వర్గాల వారికి కంటి సేవలను అందిస్తూ మంచి పేరు ప్రఖ్యాతలు సాధించారు. ఈ తొమ్మిది సంవత్సరాలలో మరో మూడు సోలీస్ ఐ హాస్పిటల్స్ బ్రాంచీలను హైదరాబాద్ లో ప్రారంభించి కంటి చికిత్సలో మంచి పేరు ప్రఖ్యాతలు సాధించారు. ఈ సంవత్సరం ది టైమ్స్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఐ హాస్పిటల్స్ కేటగిరిలో భారతదేశంలో నాలుగవ స్థానం, ఏపి, తెలంగాణలో ద్వితీయ స్థానంలో అవార్డులను గెలుచుకున్నారు. ఈ అవార్డును సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్ వి. రమణ, తెలంగాణ మాజీ ఆరోగ్య శాఖ మంత్రి హరీష్ రావు చేతులు మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా నందనంపాటి రాము ఈసీఐఎల్ లో సొలీస్ హాస్పిటల్ లో సిబ్బందితో కలిసి అవార్డు సెలబ్రేషన్ జరుపుకున్నారు. ఈ సెలబ్రేషన్ లో ముఖ్య అతిథులుగా ప్రముఖ ఆడిటర్ శివరామకృష్ణ, మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, విజయేందర్ రెడ్డి, మహేష్, భాస్కర్, మోహన్,సుబ్బారావు నీరజ ఉమా, విజయలక్ష్మి, గుంటూరు ఉమా, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

# సంపాదకీయం

## ఎన్నాళ్లీ మారణహోమం..?

దేశ రాజధాని ఢిల్లీలో ఎర్రకోట సమీపంలోని మెట్రో స్టేషన్ దగ్గర గేట్ -1 వద్ద పార్కింగ్ చేసిన ఓ కారులో పేలుళ్ళు జరిగాయి. ఈ ఘటనలో ఐదు కార్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. సమీపంలో ఉన్న దుకాణాల తలుపులు, కిటికీలు ధ్వంసమయ్యాయి. ఈ ఘటన జరిగిన తర్వాత బాంబ్ స్క్వాడ్ బృందాలతో ఘటన స్థలానికి చేరుకున్నారు. దర్యాప్తు మొదలుపెట్టారు.మొదట్లో ఈ ఘటనలో ఒకరు మృతి చెందినట్లు వార్తలు వచ్చాయి. ఆ తర్వాత చనిపోయిన వారి సంఖ్య ఎనిమిదికి పెరిగింది. పేలుడు ఘటనలో 8 మంది దుర్మరణం చెందారు. పేలుడు వల్ల 20 మంది తీవ్రంగా గాయపడ్డారు. వారి శరీరాలు పూర్తిగా ఛిద్రమయ్యాయి. గాయపడిన వారిని ఎల్ ఎన్ జీ పీ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనలో చాలావరకు వాహనాలు ధ్వంసమైనట్టు తెలుస్తోంది. ఘటనా స్థలంలో దర్యాప్తు బృందాలు విచారణ మొదలుపెట్టాయి. ఈ పేలుడు వెనక ఉగ్ర ఉందేమోనన్న కోణంలో దర్యాప్తును మొదలు పెట్టాయి. ఆదివారం యాంటీ టెర్రరిజం స్క్వాడ్ విస్తృతంగా దాడులు జరిపింది. ఈ దాడుల్లో ఉగ్ర మూలాలు ఉన్న వ్యక్తులను అరెస్ట్ చేసింది. వారిని అరెస్టు చేసిన తర్వాత ఒకరోజు వ్యవధిలో ఈ ఘటన జరగడం విశేషం.ఉగ్రవాదులు మనదేశంలో దాడులు జరపడానికి కుట్రలు పన్నారని యాంటీ టెర్రరిజం స్క్వాడ్ దర్యాప్తులో తేలింది. పలు ప్రాంతాలలో ఉగ్రవాదులను దర్యాప్తు బృందం అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఇది జరిగిన ఒక రోజు వ్యవధిలోనే ఈ దారుణం చోటుచేసుకుంది. దీని వెనుక ఉగ్రవాదులు ఉన్నారని దర్యాదు బృందం అధికారులు అనుమానిస్తున్నారు. లోతుగా దర్యాప్తు మొదలుపెట్టారు. మన దేశంలో గడిచిన వారం రోజుల వ్యవధిలో ఉగ్రవాద వ్యతిరేక పోలీసుల బృందం విస్తృతంగా దాడులు నిర్వహించింది. ఈ దాడుల్లో నలుగురు డాక్టర్లు అరెస్టు అయ్యారు.. వీరి వద్ద నుంచి పోలీసులు ఏకంగా 2900 వందల కిలోల పేలుడు పదార్థాలను, రైఫిళ్ళు, పిస్టల్స్, రిసిన్, అమోనియం నైట్రేట్ వంటి విష పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు.. ఈ పరిణామం జరిగిన గంటల వ్యవధిలోనే ఢిల్లీలో భారీ పేలుడు చోటుచేసుకుంది.వాస్తవానికి ఈ పేలుడు అనేక సంచలన విషయాలను బయటపెట్టింది. ఉగ్రవాద వ్యతిరేక బృందం నలుగు డాక్టర్లను అరెస్ట్ చేసిన తర్వాత.. ఉగ్ర కుట్ర బయటపడింది. ఢిల్లీ ప్రాంతంలోని ఫరీదాబాద్ లో ఆల్ ఫలాయ్ యూనివర్సిటీ లో అధ్యాపకుడిగా పని చేస్తున్న డాక్టర్ ముజమిల్ షకీల్, జమ్మూ కాశ్మీర్ ప్రాంతానికి చెందిన డాక్టర్ ఆదిల్ అహ్మద్ రథర్, గుజరాత్ లోని డాక్టర్ అహమ్మద్ మోహియుద్దీన్ సయ్యద్, ఉత్తరప్రదేశ్ రాష్ట్ర చెందిన మహిళ డాక్టర్‌ను ఉగ్రవాద వ్యతిరేక పోలీసుల బృందం అరెస్ట్ చేసింది.. జమ్ము కాశ్మీర్, ఫరీదాబాద్ ప్రాంతాలలో పోలీసులు సంయుక్తంగా ఆపరేషన్ నిర్వహించారు.. ఇందులో ఏకంగా నలుగురు పట్టుపడ్డారు. సమాజంలో వీరిని ఎవరు కూడా అనుమానించారనే ఉద్దేశంతోనే ఉగ్రవాద సంస్థలకు నిత్యం అందుబాటులో ఉండేవారు. దేశవ్యాప్తంగా దాడులకు ప్రణాళిక రూపొందించారు.అరెస్ట్ అయిన వైద్యులు జైషే ఏ మహమ్మద్, అన్సార్ గజ్వతుల్ హింద్ అనే ఉగ్రవాద సంస్థలతో సంబంధం ఉన్నట్టు విచారణలో తేలింది. డాక్టర్ కాబట్టి ఎవరూ అనుమానించరనే ఉద్దేశంతోనే వీరు ఉగ్రవాద సంస్థలకు టచలో ఉండేవారని తెలుస్తోంది. ఇక అరెస్టు అయిన వారిలో ఇద్దరు డాక్టర్లు 2018 -2021 కాలంలో భారత భద్రతా దళాల దాడిలో గాయపడిన ఉగ్రవాదులకు చికిత్స అందించారని తెలుస్తోంది.. ఇక ఇదే క్రమంలో ఇంటెలిజెన్స్ వర్గాలు ఈ మాడ్యూల్ మొత్తాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది.. ఢిల్లీ ఎర్రకోట వద్ద జరిగిన పేలుడు కూడా ఉగ్రదాడి అని అనుమానాలు వ్యక్తమౌతున్న నేపథ్యంలో.. ఈ నలుగురు పట్టుబడ్డారు.దేశ రాజధానిలో పేలుడు జరిగిన నేపథ్యంలో ఈ ఘటన సంచలనంగా మారింది.సరిగ్గా ఆదివారం ఆముదంతో విషయం తయారు చేసే వందల మందిని చంపడానికి కుట్ర చేసిన హైదరాబాద్ ఉగ్రవాది సయ్యద్ అహ్మద్ మోహియుద్దీన్, మరో ఇద్దరు ఐసిస్ సానుభూతిపరులను గుజరాత్ ఏటీఎస్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఆ ఘటనజరిగిన ఒక రోజు వ్యవధిలోనే ఈ దారుణం చోటు చేసుకోవడం గమనార్హం. ఆముదం గింజలను ప్రాసెస్ చేసి.. మిగిలిపోయిన వ్యర్థాలతో అత్యంత ప్రమాదకరమైన రైసిన్ అనే విష రసాయనాన్ని తయారు చేశారు. ఈ వ్యవహారం దర్యాప్తు బృందం అధికారుల విచారణలో తేలింది.గుజరాత్ యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ ఇటీవల ముగ్గురు ఉగ్రవాదులను అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. వీరు దేశవ్యాప్తంగా ఉగ్రదాడులకు కుట్ర చేశారని భద్రతా అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో నిఘా వర్గాలు హెచ్చరికలు జారీ చేశాయి. భారత్ చుట్టూ ఉగ్రవాదాన్ని విస్తరించేందుకు పాకిస్తాన్ కుట్రలు చేస్తోందని పేర్కొన్నాయి. అందులో భాగంగా భారత సరిహద్దు దేశాలైన నేపాల్, బంగ్లాదేశ్‌లోని పలు ప్రాంతాల్లో.. ఉగ్ర స్థావరాలు, శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపాయి. భారత సరిహద్దులకు కొన్ని కిలోమీటర్ల దూరంలో ఉగ్ర నివాసాలన ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు చెప్పాయిఆపరేషన్ సిందూర్ తర్వాత ఉగ్ర స్థావరాల ఏర్పాటు మరింత వేగవంతమైనట్లు జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. అయితే ఉగ్రవాద ట్రైనింగ్ తీసుకునే వారి కోసం బంగ్లాదేశ్, నేపాల్‌లోని కొన్ని ప్రాంతాల్లో శిక్షణ శిబిరాలు, నివాస సముదాయాలు ఏర్పాటు చేస్తున్నాయని తెలిపాయి. కాగా, ఇటీవల బంగ్లా, నేపాల్ సరిహద్దుల్లో ఉన్న పలు రాష్ట్రాల్లో ఉగ్రవాద అనుమానితులను భద్రతా సంస్థలు అరెస్ట్ చేశాయి. ఈ నేపథ్యంలో ఈ హెచ్చరికలు ఆందోళన కలిగిస్తున్నాయి. అయితే భారత సరిహద్దు ప్రాంతాల్లో భద్రత పెంచినట్లు నిఘా వర్గాలు పేర్కొన్నాయి. అంతేకాకుండా బంగ్లా, నేపాల్‌లలో విదేశీ నిధులతో నిర్మితమవుతున్న పలు ప్రాజెక్టులపై కూడా ఇంటెలిజెన్స్ వర్గాలు నిఘా పెట్టినట్లు తెలిపాయి.లష్కరే తొయిబా, జైషే మహమ్మద్‌లు సమన్వయ దాడులకు సిద్ధమవుతోన్నట్టు ఇటీవల నిఘా వర్గాలు గుర్తించాయి. ఈ ఏడాది సెప్టెంబర్ నుంచి ఉగ్రవాద సంస్థలు చొరబాట్లు, గూఢచర్యం, సరిహద్దు లాజిస్టిక్స్ కార్యకలాపాలను గణనీయంగాపెంచాయని వెల్లడించాయి. తాజాగా మళ్లీ.. లష్కరే తోయిబా, జైషే మహమ్మద్ నేపాల్‌లో తమ సంస్థలను విస్తరించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు నిఘా వర్గాలు హెచ్చరించడం గమనార్హం. అల్-ఖైదా, ఐసిస్ గత ఐదు నెలలుగా బంగ్లాదేశ్‌లో తమ కార్యకలాపాలను విస్తరించడానికి ప్రయత్నాలు వేగవంతం చేస్తున్నట్లు పేర్కొన్నాయి. అందులో భాగంగా పాక్‌లోని పలు ప్రాంతాల నుంచి బంగ్లాదేశ్‌కు, నేపాల్‌కు నిరంతరం ఉగ్రవాదుల వలసలు కొనసాగుతున్నాయని తెలిపాయి. అయితే ఆ ప్రాంతాల్లో ఉగ్రవాద శిబిరాల నిర్మాణానికి టర్కీ (తుర్కియే) నుంచి నిధులు అందుతున్నట్లు నిఘా సంస్థలు గుర్తించినట్లు తెలుస్తోంది.గతేడాది మహమ్మద్ యూనస్ నేతృత్వంలో బంగ్లాదేశ్‌లో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటుఅయింది. అప్పటి నుంచి భారత్‌వ్యతిరేక శక్తులకుబంగ్లా వేదికగా మారింది. మహమ్మద్ యూనస్ సారథ్యంలఈవ్యతిరేక కార్యకలాపాలు సాగుతున్నాయి. దీంతోపాకిస్తాన్‌ఉగ్రవాదులకు బంగ్లాదేశ్ కొత్త గమ్యస్థానంగా మారిపోయింది.ఇటీవల భారత్‌కు చెక్‌పెట్టేలా పాకిస్తాన్ మాస్టర్‌ప్లాన్ వేసింది. బంగ్లాదేశ్ జనపనార ఉత్పత్తుల దిగుమతులపై భారత్ ఆంక్షలు విధించిన కొన్ని రోజులకే.. తన కరాచీ పోర్ట్‌ను వినియో గించుకునేందుకు బంగ్లాదేశ్‌కు పాకిస్తాన్ బంపరాఫర్ ఇచ్చింది.

### తెలంగాణ రాష్ట్ర పెరిక కుల (పురగిరి క్షత్రియ) సంఘం

## రాష్ట్ర కో ఆర్డినేటర్ గా అంకతి వెంకటరమణ



**నాగార్జునసాగర్, నవంబర్ 29 :** నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ నియోజకవర్గం ఇండ్ల కోటయ్య గూడెం గ్రామానికి చెందిన అంకతి వెంకటరమణ ను తెలంగాణ రాష్ట్ర పెరిక కుల సంఘం రాష్ట్ర కో ఆర్డినేటర్ గా నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షులు ఎర్రంశెట్టి ముత్తయ్య తెలిపారు. ఇదిలా ఉండగా గతంలో అంకతి వెంకటరమణ ఉమ్మడి నల్గొండ జిల్లా ఎన్ఎస్ యుఐ రాష్ట్ర కార్యదర్శిగా, మాజీ ఎంపీపీగా, మాజీ సర్పంచ్ గా, మాజీ కౌన్సిలర్ గా, డివిజనల్ రైల్వే మెంబర్ గా, ఎంపీపీ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా, ఉమ్మడి రాష్ట్ర ఓబీసీ కన్వీనర్ గా పని చేశారు. నూతనంగా రాష్ట్ర కోఆర్డినేటర్ గా నియమితులైన అంకతి వెంకటరమణను గౌరవ అధ్యక్షులు లక్కర్సు ప్రభాకర్ వర్మ, మాజీ ఎమ్మెల్యే బండి పుల్లయ్య అభినందించారు. రాజకీయంగా సామాజికంగా గత మూడు దశాబ్దాలుగా చేస్తున్న సేవలు చాలా గొప్పగా ఉన్నాయన్నారు. మీ అనుభవాన్ని ఉపయోగించి పెరిక కుల అభివృద్ధి సంక్షేమం కోసం కృషి చేయాలని సూచించారు. రాష్ట్రంలోని ప్రతి పెరిక కులస్థుడిని జిల్లా, రాష్ట్ర సంఘంతో సమన్వయం చేస్తూ కులఐక్యత అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా రాష్ట్ర నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ గౌరవ అధ్యక్షులు లక్కరసు ప్రభాకర్ వర్మ,అధ్యక్షులు ఎర్రం శెట్టి ముత్తయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ ధనేకుల కృష్ణ, అసోసియేట్అధ్యక్షులు కోట మల్లికార్జున్, శాఘని హరికృష్ణ, ఆకా రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శులు కర్రే సురేందర్, బొలిశెట్టి రంగారావు, దేవరగట్టు బాల ప్రసాద్, ఆర్థిక కార్యదర్శి బోడకుంటి సుధాకర్, కార్యనిర్వాహక కార్యదర్శి నట్టే మోహన్ రావు, రాష్ట్ర కార్యదర్శి సాదే పరమేష్, ప్రచార కార్యదర్శి శ్రీధర్ల జగదీశ్వర్, తెలంగాణ రాష్ట్ర పెరిక కుల సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి సాయిని నరేందర్ లు ఎన్నికయ్యారు.

## పత్తి రైతుల సంక్షేమం కోరుతూ కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్‌కు లేఖ

### – పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ కృష్ణ

పెద్దపల్లి : పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ కృష్ణ పత్తి రైతుల సమస్యలను కేంద్రం దృష్టికి తీసుకువెళ్లారు. 2025%-%26 పత్తి కొనుగోలు సీజన్ నేపథ్యంలో, కేంద్ర టెక్స్టైల్స్ యూనియన్ మంత్రి గిరిరాజ్ సింగ్ కు ఎంపీ అధికారిక లేఖ పంపి పలు కీలక సూచనలు చేశారు. ఇందులో సీసీఐ ప్రతిపాదించినట్టు రాష్ట్ర సగటు పత్తి దిగుబడిని 11.74 క్వింటాళ్ల నుంచి 7 క్వింటాళ్లకు తగ్గించడం తప్పు నిర్ణయంగా ఎంపీ పేర్కొన్నారు. ఈ అంచనా రాష్ట్రంలోని 33 జిల్లా కలెక్టర్లు, వ్యవసాయ శాఖ డైరెక్టర్ సమర్పించిన ధృవీకరిం చిన డేటాకి విరుద్ధమని ఆయన స్పష్టం చేశారు. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు మొత్తం 6,680 ఎంఎంటిలు పత్తి కొనుగోలు కాగా, 3,175 మంది రైతులు లబ్ధి పొందారన్నారు. పత్తి కొనుగోలు మొత్తం విలువ ?52.25 కోట్లు కాగా అందులో 15.04 కోట్లు ఇప్పటికే రైతుల ఖాతాల్లో జమయ్యా యని తెలిపారు. ఇ ప్పటికే మోంతా తుఫాను కారణంగా నష్టపోయిన రైతుల పరిస్థితి మరింత దెబ్బతిం టుందని, దిగుబడి అంచనాలను తగ్గించే నిర్ణయాన్ని పున: సమీక్షా చేయాలని ఎంపీ వంశీ కృష్ణ కోరారు. అలాగే పత్తి మిల్లర్లు, ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సూచించిన మాయిశ్చర్ నార్మ్స్, ఎల్ 1/ ఎల్ 2విభజ న సమస్య, స్లాట్ బుకింగ్ కష్టా లు, జిన్నింగ్ మిల్లుల కార్యక లాపాల సమస్యలు వంటి అంశాలను కూడా కేంద్రం దృష్టికి తీసుకువెళ్లారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పలు సానుకూల చర్యలను ఎంపీ ప్రశంసించారు.

# కుత్బుల్లాపూర్‌లో అడ్డగోలు రిజిస్ట్రేషన్లు..!?





రంగారెడ్డి : ఏడాదిన్నర కాలంగా కుత్బుల్లాపూర్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఇంటి పన్ను రసీదుల ఆధారంగా జరిగే రిజిస్ట్రేషన్లను నిలిపివేశారు. నియోజకవర్గం పరిధిలోని కొంపల్లి, డి.పోచంపల్లి, బహదూర్‌పల్లిలోని కొన్ని ప్రాంతాలు మినహా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని అన్ని ప్రాంతాలలోని భూములు, ఇండ్ల స్థలాలు, ప్లాట్లకు సంబంధించిన రిజిస్ట్రేషన్లు కుత్బుల్లాపూర్ సబ్ రిజిస్టర్ కార్యాలయంలోని జరుగుతున్నాయి. హౌస్ టాక్స్‌లపై రిజిస్ట్రేషన్లు గందరగోళంగా మారడంతో ఏడాదిన్నర కాలంగా ఇక్కడ ఇంటి పన్ను పత్రాల ఆధారంగా రిజిస్ట్రేషన్లను నిలిపివేశారు. గత ఏడాది కిందట ఇక్కడ సబ్ రిజిస్టర్‌గా పని చేసిన జ్యోతి ఓ తప్పుడు రిజిస్ట్రేషన్ చేశారన్న నెపంతో ఆమెను విధుల్లోంచి తప్పించిన ప్రభుత్వం..ఆమెను జైలుకు కూడా పంపింది. తాజాగా అశోక్ కుమార్ అనే రిజిస్ట్రేషన్ అధికారి బాచుపల్లిలోని నిషేధిత భూములను రిజిస్ట్రేషన్ చేశారని, అది గిఫ్ట్ డీడ్‌గా చేసి ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టారని ఆయనను సర్కారు సస్పెండ్ చేసింది.అయితే అశోక్‌కుమార్ ఉన్న సమయంలో ఇంటి పన్ను రసీదుల ఆధారంగా రిజిస్ట్రేషన్ల ప్రక్రియ కూడా సాగలేదు. ఆయన వెళ్లపోగానే ఇటీవల కాలంలో ఇంటి పన్ను రసీదుతో రిజిస్ట్రేషన్లు చకచకా జరిగిపోతున్నాయి. 60 గజాల లోపు వాటిని చేయొచ్చన్న ముసుగులో 100 గజాల దాటిన వాటిని సైతం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలన్న చందంగా కొందరు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కుత్బుల్లాపూర్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ప్రస్తుతం ముగ్గురు సబ్‌రిజిస్ట్రార్‌లు(జాయింట్ రిజిస్ట్రార్ 1,2,3) పని చేస్తున్నారు. ఇక్కడ ప్రతినిత్యం సరాసరి 150 వరకు డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ అవుతున్నాయి. అధికారులు డాక్యుమెంట్ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి అవి క్లియర్ టైటిలేనా, ప్రభుత్వ భూములా.. నిషేధిత భూముల జాబితాలో ఉన్నాయా.. వాటిపై ఏవైనా వివాదాలు అభ్యంతరాలు ఉన్నాయా..వంటి వాటిని పరిశీలించిన అనంతరమే రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉంటుంది.కానీ ఇవేమీ పట్టించుకోకుండా ఇక్కడి అధికారులు కేవలం ఇంటి పన్ను రసీదులపైనే రిజిస్ట్రేషన్లు చేయడం చూస్తుంటే అధికారుల తీరుపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఒక్కో రిజిస్ట్రేషన్‌కు లక్షల రూపాయలు వసూలు చేస్తూ క్షణాల్లో రిజిస్ట్రేషన్ చేస్తున్నారన్న ప్రచారం జరుగుతున్నది. ఇందుకు తాజాగా చోటు చేసుకున్న ఓ రిజిస్ట్రేషన్ ఊతమిస్తోంది. బాచుపల్లి మండలం, రాజీవ్‌గాంధీనగర్‌లోని ఓ 110 గజాల స్థలంలో ఉన్న ఇంటికి సంబంధించి ఇంటి పన్ను పత్రాల ఆధారంగా ఈ నెల 8న ఓ మహిళ పేరిట రిజిస్ట్రేషన్ చేశారు.కరెక్టుగా మరో మూడు నిమిషాల వ్యవధిలోనే అదే రిజిస్ట్రేషన్ పత్రాలను గిఫ్ట్ డీడ్‌గా రిజిస్ట్రేషన్ చేశారు. ఈ వ్యవహారంలో పెద్దమొత్తంలో చేతులు మారాయన్న ఆరోపణలు ఉన్నాయి. లక్షల్లో డబ్బులు తీసుకొని క్షణాల వ్యవధిలో రిజిస్ట్రేషన్ చేశారని పేర్కొంటున్నారు. కేవలం ఒకే ఇంటికి సంబంధించిన రిజిస్ట్రేషన్, గిఫ్ట్ డీడ్ రిజిస్ట్రేషన్లు మూడు నిమిషాల వ్యవధిలో పూర్తవడం గమనార్హం. నిత్యం రిజిస్ట్రేషన్ కార్యాలయం చుట్టూ తిరిగే సామాన్య జనం మరికొందరు మాత్రం అధికారులు అడిగినంత ఇస్తే ఇలాంటి అద్భుతాలు జరుగుతూనే ఉంటాయన్న చర్చ లేకపోలేదు. ఈ నేపథ్యంలోనే ఒక్కరోజులోనే రూ. లక్షలాది రూపాయలు చేతులు మారుతున్నట్లు వినికిడి.ఇటీవల ఇటువంటి డాక్యుమెంట్లు కుప్పలు తెప్పలుగా రిజిస్ట్రేషన్ జరిగినట్లు తెలుస్తోంది. రిజిస్ట్రేషన్లు చేయించుకున్న వారి నుంచి పెద్ద మొత్తంలో వసూలు చేసి అధికారులకు అందించే విషయంలో కార్యాలయంలో పని చేసే ఓ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి కీలకపాత్ర పోషిస్తున్నట్లు ఉద్యోగుల్లోనే చర్చ జరుగుతున్నది. తను స్వయంగా క్లైంట్లతో మాట్లాడకపోయినా డాక్యుమెంట్ రైటర్ల ద్వారా దందా కొనసాగిస్తున్నట్లు సమాచారం. ఈ అక్రమ దందాపై ఉన్నతాధికారులు దృష్టి సారించి విచారణ జరిపితే కుప్పలు తెప్పలుగా ఇటువంటి రిజిస్ట్రేషన్లు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందంటున్నారు. ఇదే విషయంపై కుత్బుల్లాపూర్ జాయింట్ రిజిస్ట్రార్-1 మధుబాలీలీబును వివరణ కోరగా, మొదట్లో అలాంటిదేమి లేదని, ఒకవేళ ఇంటి నంబరు పత్రాల ఆధారంగా రిజిస్ట్రేషన్ చేయాల్సి వస్తే 60 గజాల లోపు ఉంటేనే చేస్తామన్నారు. మరీ 110 గజాల ఇంటిని, అది కేవలం మూడు నిమిషాల వ్యవధిలోనే రెండు రిజిస్ట్రేషన్లు ఎలా చేశారని ప్రశ్నిస్తే తర్వాత మాట్లాడుదామంటూ మాట దాటవేయడం గమనార్హం

# అమెరికాలో ట్రంప్ వ్యతిరేక పవనాలు..!



ట్రంప్ అధ్యక్షుడు అయ్యాక ఏడాదిలోనే వపరీతమైన వ్యతిరేకతను మూటగట్టుకున్నారు. తమ దేశంలోనే గాకుండా ప్రపంచం యావత్తు ఇప్పుడు ట్రంప్ తీరుపై మండిపడుతోంది. పెద్దన్న పాత్రలో ప్రపంచానికి మేలు చేయడం, దేశీయంగా ఆదరణ పొందడంలో ట్రంప్ విఫలమ్యారు. అంతేకాదు ప్రతి ఒక్కరూ ట్రంప్ దిగిపోవాలనే కోరుకుంటున్నారు. ముఖ్యంగా స్థానికంగా అమెరికా ప్రజలు కూడా ట్రంప్ తీరుపై ఆగ్రహంతో రగిలిపోతున్నారు. అందుకు తాజాగా జరిగిన ఎన్నికల ఫలితాలే నిదర్శనం. ప్రపంచాన్ని పలు రకాలుగా బెదిరిస్తూ, వీరంగాలు వేస్తున్న డోనాల్డ్ ట్రంప్‌కు జోహ్రాన్ మమ్దానీ విజయం నైతికంగా పెద్ద ఎదురుదెబ్బ. అంతేగాకుండా రాజకీయంగా ఘాటైన హెచ్చరికగా కూడా చూడాలి. జాత్యహంకార హుంకరింపులను, వర్ణ వివక్షలను అధిగమించి ఆసియా, ఆఫ్రికా సంతతికి చెందిన అమెరికా పౌరులు ప్రతిష్ఠాత్మక స్థానిక ఎన్నికల్లో ఓటర్ల హృదయాలను చూరగొనడం అపూర్వమే గాకుండా, అద్వితీయంగానూ గుర్తించాలి. న్యూయార్క్, వర్జీనియా, న్యూజెర్సీల్లో డెమాక్రట్లు గెలవడం ట్రంప్ చాపకింద నీరు చేరించదనే చెప్పలి. వివిధ కీలక పదవులను గెలుచుకొని వీరుచరిత్రను సృష్టించడం కన్నా ట్రంప్‌కు సవాల్ విసిరారని చెప్పాలి. న్యూయార్క్ మహానగర మేయర్ పదవికి హోరాహోరీగా జరిగిన పోరులో జోహ్రాన్ మమ్దానీ అద్వితీయ విజయం సాధించారు. వర్జీనియా లెఫ్టినెంట్ గవర్నర్ పదవికి గజాలా హష్మీ ఎన్నికయ్యారు. సిన్ సినాటీ మేయర్ పదవికి ఆఫ్తాబ్ పురేవాల్ రెండోసారి ఎన్నికై రికార్డు సాధించారు. అందులోనూ దేశ ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ సవతి తమ్ముడు కోరీ బౌమాన్‌ను ఆయన చిత్తుగా ఓడించడం మరో విశేషం. వీరందరూ డెమొక్రాట్ అభ్యర్థులు కావడం ఇంకో విశేషం. అమెరికా స్థానిక ఎన్నికల్లో డెమాక్రట్ల విజయం ట్రంప్ పాలనాతీరుపై ప్రజల్లో పెల్లుబుకుతున్న ఆగ్రహానికి నిదర్శనగంఅ చూడాలి. ఈ విజయ పరంపరలో న్యూయార్క్ ప్రత్యేకంగా నిలిచింది. ప్రపంచ మహా నగరాల్లో అగ్రస్థానంలో నిలిచే న్యూయార్క్ మేయర్ పదవిని పిన్నవయస్కుడైన ముమ్దానీ చేజిక్కించుకోవడం ఓ చరిత్ర అయితే..అతను ట్రంప్‌కు సవాల్ విసరడం మరో చరిత్రగా గుర్తించాలి. దేశాధ్యక్షుడయిన ట్రంప్ వ్యతిరేక ప్రచారం చేసినా అతడు ధిక్కరించి నిలిచాడు. మాజీ గవర్నర్ ఆండ్రూ కూమో, రిపబ్లికన్ కర్టిస్ స్లీవాలను మట్టి కరిపించారు. బహుళజాతులతో కూడిన సుమారు 90 లక్షల జనాభా, 254 బిలియన్ డాలర్ల భారీ బడ్జెట్‌తో కూడిన న్యూయార్క్ నగర మేయర్ పదవి అమె రికా రాజకీయాల్లో కీలక స్థానం ఆక్రమిస్తుంది. అలాంటి కీలక పదవిని దక్కించుకునేందుకు మమ్దానీ విలక్షణ పోరాటాన్ని వీరోచితంగా నడిపారు. డెమొక్రాటిక్ సోషలిజం తన సిద్దాతం అని బాహాటంగా చాటుకున్న మమ్దానీ దేశానికి కుబేరులు అవసరం లేదని ఢంకా బజాయించి మరీ చెప్పడం విశేషం. దాంతో సంపన్నులు వందల వేల కోట్ల డబ్బు గుమ్మరించి అతడిని ఓడించాలని చూశారు. కొందరు కార్పొరేట్లు నామమాత్రంగా మద్దతు తెలిపినా ఎన్నికల నిధులు మాత్రం విదల్చ కపోవడం గమనార్హం. పేదల కొద్దిపాటి చందాలతో పోటీచేసి పెద్దలకు చుక్కలు చూపించారు మమ్దానీ. మేక్ అమెరికా గ్రేట్ అగైన్ వంటి జాతీయవాద నినాదాలతో రెండోసారి అధ్యక్ష పదవి చేపట్టిన డొనాల్డ్ ట్రంప్ న్యూయార్క్‌లో మమ్దానీని ఓడించేందుకు గట్టిగా కృషిచే శారు. వివక్షాపూరిత ప్రచారాన్ని మమ్దానీ ప్రజా సంక్షేమ నినాదాలతో ఢీకొట్టారు. అమెరికా గొప్పదేశం కావాలంటే సామాన్యుల సమస్యలు నెరవేరడం తక్షణ అవసరమని సంక్షేమ హామీలతో సవాల్ విసిరారు. అణ్వస్త్రాల కన్నా ప్రజలకు అన్నవస్త్రాలు ముఖ్యమని చాటిచెప్పారు. కూడూ, గూడూ, గుడ్డా కావాలని దేశ నాయకత్వానికి గడ్డిపెట్టారు. శుష్క జాతీయవాద నినాదాలను ప్రజావాణితో ఎదుర్కొన్నారు. సంపన్న అమెరికాకు మరోసారి పేదల బాగోగులను గుర్తుచేసి గుణపాఠం చెప్పారు. ట్రంప్ విధానాలకు ఈ విజయ పరంపర చెంపపెట్టు లాంటిది. రిపబ్లికన్ ఉడుం పట్టులో బిగుసుకుపోయిన అమెరికాలో మారుతున్న ఆలోచనా ధోరణికి ఈ విజయాలు అద్దం పట్టాయి. ముఖ్యంగా అధ్యక్షుడు ట్రంప్ అనుసరిస్తున్న వలస వ్యతిరేక విధానాలపై నిరసనగా కూడా ఈ విజయాలను చూడాల్సి ఉంటుంది. ట్రంప్ రెండోసారి అధఌకారం చేపట్టాక జరిగిన ఈ అతిపెద్ద ఎన్నికల ఫలితాలు డెమొక్రాట్లకు మంచి ఉత్సాహాన్ని ఇచ్చాయి. న్యూయార్క్‌ను మమ్దానీ గెలుచుకోవడంతో పాటు, న్యూజెర్సీ, వర్జీనియా గవర్నర్లుగా డెమోక్రటిక్ పార్టీకి చెందినవారే గెలవడం విశేషం. ట్రంప్ పార్టీ, ఆయన బృందం, మతవాదులూ మితవాదులు కలిసికట్టుగా ముస్లిం వ్యతిరేకతను ఎంతగా రేపినప్పటికీ మమ్దానీ, హష్మీల విజయం ఆపలేకపోయారు. డెమోక్రాటిక్ పార్టీ తరఫున నగర మేయర్ అభ్యర్థిత్వానికి పోటీపడిన పదకొండుమంది వెనక్కునెట్టి మమ్దానీ ఎన్నికకావడం మిగతా ప్రపంచాన్ని ఆకర్షించింది, ట్రంప్‌ను భయపెట్టింది. అతని విజయం ఖాయమని అర్థం అవుతున్నకొద్దీ ట్రంప్ దాడిహెచ్చింది, దూకుడు పెరిగింది. ఓటర్లకు మమ్దానీ మత, సైద్ధాంతిక మూలాలను ట్రంప్ పదేపదే గుర్తుచేస్తూ, ఈ కమ్యూనిస్టు ఏలుబడిలో నగరం నాశనమైపోతుందని హెచ్చరించారు వెయ్యేళ్ళ విఫలకమ్యూనిస్టు సిద్ధాంతాన్ని ఆచరణలోకి తెచ్చి ఆర్థికంగా, సామాజికంగా నగరాన్ని భ్రష్టు పట్టిస్తాడన్నారు.



# ఆలుగడ్డలను ఈ విధంగా మాత్రం తినకండి..

## లాభం కలగదు సరికదా, తీవ్రంగా నష్టం ఉంటుంది..


ఆలుగడ్డలను సహజంగానే చాలా మంది ఎంతో ఇష్టంగా తింటారు. వీటితో వేపుడు చేస్తే ఎంతో రుచిగా ఉంటుంది. అలాగే కుర్మా, టమాటా కూర కూడా చేసి తినవచ్చు. ఆలుతో చిప్స్‌ను కూడా తయారు చేసి తింటారు. ఇవి కూడా ఎంతో రుచిగా ఉంటాయి. కానీ ఆలును వేపుళ్లు, చిప్స్ లాంటి రూపంలో తింటే మనకు జరిగే మేలు ఏమీ ఉండదు. కానీ నష్టం మాత్రం అధికంగా ఉంటుంది. అదే ఆలుగడ్డలను ఉడకబెట్టి లేదా కూరగా చేసి తింటేనే మనకు లాభం ఉంటుందని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. ఆలుగడ్డ ల్లో మన శరీరానికి కావల్సిన పలు ముఖ్యమైన పోషకాలు ఉంటాయి. ఆలుగడ్డల్లో పిండి పదార్థాలు అధికంగా ఉంటాయి. కనుక ఇవి మనకు శక్తిని అందిస్తాయి. ఒక మీడియం సైజు ఆలుగడ్డలో సుమారుగా 26 గ్రాముల మేర పిండి పదార్థాలు ఉంటాయి.

**క్యాన్సర్ రాకుండా..:** ఆలుగడ్డను పిండి పదార్థాలకు మంచి నెలవుగా చెప్పవచ్చు. ఇది శరీరానికి కావల్సిన శక్తిని అందిస్తుంది. కానీ అధికంగా తింటే మాత్రం బరువు పెరిగే అవకాశం ఉంటుంది. శారీరక శ్రమ లేదా వ్యాయామం ఎక్కువగా చేసేవారికి కావల్సిన శక్తిని ఆలుగడ్డలు అందిస్తాయి. కనుక వారు రోజూ వీటిని ఆహారంలో భాగం చేసుకుంటే మంచిది. అలాగే ఆలుగడ్డలో ఉండే పలు సమ్మేళనాలు పెద్ద పేగు క్యాన్సర్ రాకుండా రక్షిస్తాయి. పెద్ద పేగును ఆరోగ్యంగా ఉంచుతాయి. ఆలుగడ్డలను మోతాదులో తింటుంటే కొలెస్ట్రాల్ లెవల్స్ తగ్గుతాయి. ట్రై గ్లిజరైడ్స్ స్థాయిలను నియంత్రణలో ఉంచవచ్చు. ఆలుగడ్డలను ఎల్లప్పుడూ ఉడకబెట్టి మాత్రమే తినాలి. వేయించి లేదా పచ్చిగా తినకూడదు. ఇవి సరిగ్గా జీర్ణం కావు.

**పోషకాలు అధికంగా..:** 150 గ్రాముల మేర ఆలుగడ్డలను తింటే 27 మిల్లీగ్రాముల విటమిన్ సి లభిస్తుంది. మనకు రోజుకు కావల్సిన విటమిన్ సి లో ఇది 45 శాతం. అలాగే 630 మిల్లీగ్రాముల మేర పొటాషియం, 0.2 మిల్లీగ్రాముల విటమిన్ బి6, స్వల్ప మోతాదులో థయామిన్, రైబోఫ్లేవిన్, ఫోలేట్, నియాసిన్ మెగ్నిషియం, ఐరన్, జింక్ తదితర పోషకాలు వీటి ద్వారా లభిస్తాయి. ఆలుగడ్డలను పైన పొట్టుతో తింటే మేలు. చాలా మంది పొట్టు తీసేసి తింటారు. దీని వల్ల అనేక పోషకాలను, ముఖ్యంగా ఫైబర్‌ను కోల్పోవాల్సి వస్తుంది. ఆలుగడ్డలను బాగా కడిగి తొక్కతో సహా ఉడకబెట్టి తింటే మేలు జరుగుతుంది. ఆలుగడ్డల్లో కార్టినాయిడ్స్, పాలిఫినాల్స్ అధికంగా ఉంటాయి. ఇవి క్యాన్సర్ ప్రమాదాన్ని చాలా వరకు తగ్గిస్తాయి.


**అందానికి కూడా..:** ఆలుగడ్డలు కేవలం ఆరోగ్య ప్రయోజనాలు అందించడమే కాదు, అందానికి కూడా పనిచేస్తాయి. ఆలుగడ్డలను గుజ్జుగా చేసి ముఖానికి ఫేస్ ప్యాక్‌లా ఉపయోగించవచ్చు. దాన్నే జుట్టుకు రాసి హెయిర్ ప్యాక్‌లా వాడవచ్చు. దీంతో చర్మం, శిరోజాలు ఆరోగ్యంగా ఉంటాయి. చర్మం కాంతివంతంగా మారి మృదువుగా ఉంటుంది. యవ్వనంగా కనిపిస్తారు. ముఖంపై ఉండే ముడతలు మచ్చలు పోతాయి. అలాగే జుట్టు రాలడం తగ్గుతుంది. శిరోజాలు ఒత్తుగా, దృఢంగా పెరుగుతాయి. ఆలుగడ్డలను కాసేపు ఫ్రిజ్‌లో ఉంచి అనంతరం వాటిని తీసి చక్రాల్లా అడ్డంగా కట్ చేయాలి. ఆ ముక్కలను కళ్లపై 15 నిమిషాల పాటు పెట్టుకోవాలి. తరచూ ఇలా చేస్తుంటే కళ్ల కింద ఉండే డార్క్ సర్కిల్స్ మాయం అవుతాయి. ఆలుగడ్డల్లో ఉండే విటమిన్ సి రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. వ్యాధులు రాకుండా రక్షిస్తుంది. వీటిల్లో ఉండే పొటాషియం రక్త సరఫరాను మెరుగు పరిచి గుండెను ఆరోగ్యంగా ఉంచుతుంది. ఆలుగడ్డలు ఆరోగ్యానికి ప్రయోజనకరమే అయినప్పటికీ వీటిని అధికంగా తినకూడదు. అధిక బరువు ఉన్నవారు,

## కోలన్ క్యాన్సర్ కారకాలు



మనిషిని దీర్ఘకాలంపాటు పట్టి పీడించే వ్యాధుల్లో క్యాన్సర్ ప్రధానమైనది. క్యాన్సర్లలో పెద్దపేగు (కోలన్) క్యాన్సర్ ఒకటి. అయితే, మనలో చాలామందికి కోలన్ క్యాన్సర్ ముప్పును పెంచే జీవనశైలి అలవాట్ల గురించి అంతగా తెలియదని ఓహియో స్టేట్ యూనివర్సిటీ జరిపిన అధ్యయనంలో వెల్లడైంది. ఊబకాయం, మద్యపానం, తగినంత శారీరక శ్రమ లేకపోవడం, కొవ్వు పదార్థాలు ఎక్కువగా ఉన్న ఆహారం, ప్రాసెస్డ్ ఆహార పదార్థాలు పెద్దపేగు క్యాన్సర్‌కు దోహదపడతాయి. కాబట్టి, దీనికి సంబంధించి అనుమానంగా అనిపించినా, డాక్టర్లు అవసరమని చెప్పినా.. 45ఏండ్లు దాటిన ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా కొలనోస్కోపీ చేయించుకోవడం మంచిదట. వీలైతే ఇంకా ముందే మేల్కోవాలని పరిశోధకులు సూచించారు.

## ఏ వైపు మంచిది?



చక్కటి ఆరోగ్యానికి చిక్కటి నిద్ర ఎంతో అవసరం. లేకుంటే.. అనారోగ్యాల పాలవ్వడం ఖాయం! ఈ విషయంలో నిద్ర ఒక్కటే కాదు.. నిద్రపోయే భంగిమ కూడా ఎంతో కీలకం. అందులోనూ ఎడమవైపు తిరిగి పడుకుంటే.. ఎంతో ప్రయోజనకరం.

రకరకాల మనుషులు.. రకరకాలుగా నిద్రిస్తుంటారు. కొందరు వెల్లకిలా పడుకుంటే.. మరికొందరు బోర్లా పడుకుంటారు. కొందరు కుడివైపు వాలితే.. ఇంకొందరు ఎడమవైపునకు ఒరుగుతుంటారు. వీటన్నిట్లోకి.. ఎడమవైపు తిరిగి పడుకోవడమే ఆరోగ్యానికి ఎంతో మేలని అంటున్నారు నిపుణులు. ఇలా పడుకోవడం వల్ల భవిష్యత్తులోనూ ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా ఉంటాయని చెబుతున్నారు. ఎడమవైపు తిరిగి పడుకోవడం గుండెకు ఎంతో మేలుచేస్తుంది. గుండె ఎడమ వైపునే ఉంటుంది కాబట్టి, అదే దిశలో పడుకుంటే గురుత్వాకర్షణ వల్ల ఎలాంటి ఇబ్బందుల్లేకుండా గుండెకు రక్త సరఫరా అవుతుంది. ఫలితంగా గుండెపై ఒత్తిడి తగ్గిపోతుంది.

గురక సమస్య తగ్గాలంటే.. ఎడమవైపు తిరిగి పడుకోండి. శ్వాస తీసుకోవడం కూడా సులభం అవుతుంది. ఎడమవైపు తిరిగి పడుకోవడం వల్ల జీర్ణవ్యవస్థ ఆరోగ్యం మెరుగుపడుతుంది. తిన్న ఆహారం జీర్ణం కాగా, మిగిలిన వ్యర్థాలు, టాక్సిన్లన్నీ పేగుల్లోనే ఉండిపోతాయి. కుడివైపు కన్నా ఎడమవైపు తిరిగి పడుకున్నప్పుడే.. అవన్నీ సులభంగా కిందికి వెళ్లిపోతాయి. ఇక ఎడమ వైపు తిరిగి పడుకోవడం వల్ల.. వీపు, నడుము, వెన్నెముకపై ఒత్తిడి తగ్గుతుంది. మంచి నిద్ర పడుతుంది. ముఖ్యంగా.. గర్భిణులు ఇలా పడుకోవడం వల్ల పిండానికి రక్త ప్రసరణ మెరుగవుతుంది. ఆరోగ్యానికి ఎంత మంచిదైనా.. ఎప్పుడూ ఒకే వైపు తిరిగి పడుకోలేం. అందుకే కాసేపు కుడివైపు, వెల్లకిలా పడుకున్నా.. వీలైనంత ఎక్కువ సమయం ఎడమ వైపు తిరిగి పడుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

## రోజూ ఒక గ్లాస్ మజ్జిగను సేవిస్తే..

# ఇన్ని లాభాలు కలుగుతాయా..?



సాధారణంగా చాలా మంది పెరుగును ఇష్టంగా తింటుంటారు. కానీ మజ్జిగను మాత్రం తీసుకోరు. అందులో నీటి శాతం అధికంగా ఉంటుందని చెప్పి మజ్జిగను సేవించేందుకు అంతగా ఇష్టపడరు. అయితే పెరుగు కన్నా మజ్జిగనే ఎక్కువ ఆరోగ్యకరమైందని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. మన శరీరంలోని వేడిని తగ్గించేందుకు రెండూ ఉపయోగకరమైనవే. కానీ మజ్జిగలో కొవ్వు శాతం చాలా తక్కువగా ఉంటుంది. కనుక ఇది మనకు ఇంకా ఎక్కువ మేలు చేస్తుందని అంటున్నారు. ఇక వేసవి కాలంలో రోజూ ఒక గ్లాస్ మజ్జిగను మధ్యాహ్నం సమయంలో తాగితే ఎంతో మేలు జరుగుతుంది. మజ్జిగ మనకు అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. మజ్జిగను రోజూ సేవించడం వల్ల అనేక పోషకాలు లభిస్తాయి.

**జీర్ణ వ్యవస్థ పనితీరుకు..:** మజ్జిగ ప్రొ బయోటిక్ ఆహారాల జాబితాకు చెందినది. అందువల్ల మజ్జిగను రోజూ తాగితే జీర్ణ వ్యవస్థలో మంచి బ్యాక్టీరియా పెరుగుతుంది.

ఇది జీర్ణక్రియను మెరుగు పరుస్తుంది. తిన్న ఆహారం సరిగ్గా జీర్ణంఅయ్యేలా చేస్తుంది.కడుపుఉబ్బరం, అసిడి టీ, గ్యాస్‌సమస్యల నుంచి ఉపశమనంలభిస్తుంది.మలబద్ధకం తగ్గు తుంది. మజ్జిగలోక్యాల్షియం సమృద్ధిగాఉంటుంది.అందువల్ల మజ్జిగ ను రోజూ సేవిస్తే ఎముకలు, దంతాలు దృఢంగా, ఆరోగ్యంగా ఉంటాయి. మజ్జిగలో లాక్టిక్ యాసిడ్‌ఉంటుంది.ఇది శరీర రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. దీంతో శరీరం రోగాలు, ఇన్‌ఫెక్షన్లకు వ్యతిరేకంగా పోరాటం చేస్తుంది. వ్యాధుల నుంచి రక్షణను అందిస్తుంది.

**బరువు తగ్గేందుకు..:** అధిక బరువు తగ్గాలని చూస్తున్నవారికి మజ్జిగ మంచి ఆహారం అని చెప్పవచ్చు. మజ్జిగలో ప్రోటీన్లు ఎక్కువగా, కొవ్వు తక్కువగా ఉంటాయి. పెరుగుతో పోలిస్తే మజ్జిగలో కొవ్వు చాలా తక్కువగా ఉంటుంది. అందువల్ల బరువు తగ్గాలనుకునే వారికి మంచి ఆహారం అని చెప్పవచ్చు. దీన్ని తాగితే ఎక్కువ సేపు ఉన్నా కడుపు నిండిన భావనతో ఉంటారు. ఆకలి వేయదు. దీంతో ఆహార్ తక్కువగా తింటారు. ఇది బరువు తగ్గేందుకు సహాయం చేస్తుంది. మజ్జిగను తాగడం వల్ల వేసవిలో శరీరం కోల్పోయిన ఎలక్ట్రోలైట్స్‌ను తిరిగి పొందవచ్చు. దీంతో వేసవి తాపం నుంచి ఉపశమనం లభిస్తుంది. శరీరం డీహైడ్రేషన్ బారిన పడకుండా ఉంటుంది. ఎండ దెబ్బ నుంచి సురక్షితంగా ఉండవచ్చు.

**గుండె ఆరోగ్యానికి..:** మజ్జిగలో అనేక ప్రోటీన్లు, యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి కొలెస్ట్రాల్ లెవల్స్‌ను తగ్గిస్తాయి. దీని వల్ల గుండె ఆరోగ్యంగా ఉంటుంది. మజ్జిగలో ఉండే బయో యాక్టివ్ సమ్మేళనాలు శరీరంలో రక్త సరఫరాను మెరుగు పరుస్తాయి. దీంతో బీపీ తగ్గుతుంది. హైబీపీ ఉన్నవారు మజ్జిగను సేవిస్తుంటే ప్రయోజనం ఉంటుంది. దీంతో గుండె కూడా ఆరోగ్యంగా ఉంటుంది. గుండె పోటు రాకుండా నివారించవచ్చు. మజ్జిగలో ఉండే రైబోఫ్లేవిన్ లివర్ పనితీరును మెరుగు పరుస్తుంది. దీంతో లివర్‌లో ఉండు వ్యర్థాలు, టాక్సిన్లు బయటకు పోతాయి. లివర్ ఆరోగ్యంగా ఉంటుంది. ఫ్యాటీ లివర్ సమస్య ఉన్నవారు రోజూ మజ్జిగను సేవిస్తుంటే ఫలితం ఉంటుంది. చర్మ సంరక్షణకు కూడా మజ్జిగ మేలు చేస్తుంది. మజ్జిగను సేవిస్తుంటే డ్యామేజ్ అయిన చర్మ కణాలు మరమ్మత్తులకు గురవుతాయి. దీంతో చర్మం కాంతివంతంగా మారి మృదువుగా ఉంటుంది. ఇలా మజ్జిగను రోజూ సేవిస్తే అనేక ప్రయోజనాలను పొందవచ్చు.

# మహిళలూ.. ఈ పోషకాలు అందేలా చూసుకోండి!




గృహిణులైనా, ఉద్యోగాలు చేసే మహిళలైనా ముందుగా వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. ఆరోగ్యాన్ని రక్షించటానికి సమతుల్య ఆహారం కీలక పాత్ర పోషిస్తుంది. మహిళలు తమ డైట్‌లో ఖచ్చితంగా పోషకాలు ఉండే ఆహారాన్ని తీసుకోవాలి. లేకపోతే అనేక ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటారు. రుతుస్రావం నుంచి ప్రెగ్నెన్సీ, డెలివరీ, మెనోపాజ్ వరకూ ఇలా శరీరంలో అనేక మార్పులు చోటుచేసుకుంటాయి. ఇది ఒత్తిడికి దారితీస్తుంది. రక్తహీనత, నీరసం, అలసట, తలనొప్పి, రోగ నిరోధకశక్తి తగ్గటం, ప్రెగ్నెన్సీ సంబంధిత రుగ్మతలు, రొమ్ము క్యాన్సర్, ఆర్థరైటిస్, ఓవేరియన్, పాలీసిస్టోసిస్ వంటి సమస్యలతో ఎక్కువగా ఇబ్బందులు పడుతుంటారు. మహిళలు ఆరోగ్యంగా ఉండటానికి, వారి జీవన నాణ్యతను పెంపొందించుకోవటానికి, దీర్ఘాయువును పొందటానికి ఆహారం కీలకపాత్ర పోషిస్తుందని నిపుణులు చెబుతున్నారు.

వయస్సు రీత్యా మహిళలకు శరీరంలో వచ్చే మార్పుల కారణంగా వారికి పలు రకాల విటమిన్లు అవసరమవుతాయి. మగవారితో పోలిస్తే మహిళ లకు ప్రత్యేకంగా కొన్ని విటమిన్లు అవసరమ వుతాయి. పెరుగుతున్న వయస్సుతోపాటు కొన్ని విటమిన్లు తప్పక తీసుకోవాలి. యునిసెఫ్ నివేదిక ప్రకారంలో ప్రపంచంలో 100 కోట్ల కంటే ఎక్కువ మంది మహిళలు, ఆడపిల్లలు రకరకాల విటమిన్లు, పోషకాహార లోపంతో బాధపడుతున్నారు. ఈ లోపాలను అధిగమించటం కోసం తీసుకునే ఆహారంలో కొన్ని మార్పులు చేసుకోవాలి.

ఒత్తిళ్లకు దూరంగా ఉండాలి: చాలామంది మహిళలు తమ వ్యక్తిగత, వృత్తిపరమైన జీవితాలను బ్యాలెన్స్ చేసుకోవటానికి ఇబ్బంది పడతారు. ఇది ఒత్తిడికి దారితీస్తుంది. మహిళలను ఎక్కువగా రక్తహీనత, నీరసం, అలసట, తలనొప్పి, రోగ నిరోధక శక్తి తగ్గడం, ప్రెగ్నెన్సీ సంబంధిత సమస్యలు, రొమ్ము క్యాన్సర్, ఆర్థరైటిస్, ఓవేరియన్ పాలీసిస్టోసిస్ వంటి ఆరోగ్య సమస్యలు వేధిస్తాయి. వారు తీసుకునే ఆహారమే వారి జీవన నాణ్యతను మెరుపర్చుకోవడానికి కీలకపాత్ర పోషిస్తుంది.

ఫోలెట్ : తమ రోజువారీ డైట్‌లో దీనిని ఖచ్చితంగా తీసుకోవాలి. ఇది గుండె ఆరోగ్యం, నరాల పనితీరు, చర్మ ఆరోగ్యం, జీర్ణక్రియ, రక్త ప్రసరణ, ఉత్పత్తిని మెరుగుపర్చటంలో సహాయపడుతుంది. గర్భధారణ సమయంలో దీనికి ఖచ్చితంగా తీసుకుంటే మేలని డాక్టర్లు చెబుతుంటారు. గర్భధారణ సమయంలో, మహిళలు ఫోలెట్ కచ్చితంగా తీసుకోవాలని వైద్యులు సూచిస్తూ ఉంటారు. ఫోలిక్ యాసిడ్ గర్భంలోని పిండం ఎదుగుదలకు, అభివృద్ధికి అవసరమైన ముఖ్యమైన పోషకాల్లో ఒకటి. గర్భంలో శిశువు మెదడు, వెన్నుముక అభివృద్ధికి సహాయపడుతుంది. ఇది బ్రకోలీ, క్యాబేజీ, పాలకూర, తృణధాన్యాలు, చిక్కుళ్లు, శనగలు, రాజ్మా, కమల, కరివేపాకు, మెంతి, తోటకూర, గోరుచిక్కుడు, బెండకాయ, గుడ్లు, ఆవు పాలల్లో సమృద్ధిగా లభిస్తుంది.

కాల్షియం : ఎముకలు, దంతాలు బలంగా ఉండటానికి కీలక పాత్ర పోషిస్తుంది. మహిళలు వయస్సు పెరిగే కొద్దీ బోలు ఎముల వ్యాధి వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. దీని కారణంగా ఎముకలు పెళుసుగా, బలహీనంగా మారతాయి. ఇవి సమృద్ధిగా ఉండే పాలు, పెరుగు, చీజ్ వంటి డైరీ ఉత్పత్తులను తీసుకోవాలి. పాలకూర, ఆకుకూరల్లోనూ కాల్షియం అధికంగా ఉంటుంది.

ఐరన్ : డబ్ల్యుహెచ్ఒ నివేదిక ప్రకారం దాదాపు 40 మంది గర్భిణీస్త్రీలు రక్తహీనతతో బాధపడుతున్నారు. దీనికి ప్రధాన కారణం ఐరన్‌లోపమే. ఫలితంగా అలసట, బలహీనత వేధిస్తాయి. అలసట, బలహీనత వేధిస్తాయి. పౌల్ట్రీ, ఫిష్, నువ్వులు, బెల్లం, బీన్స్ వంటి ఆహార పదార్థాలో ఐరన్ సమృద్ధిగా ఉంటుంది.

ఫైబర్ : ఫైబర్ బరువును నియంత్రించటానికి దోహదపడుతుంది. జీర్ణక్రియను ప్రోత్సహిస్తుంది. గుండె సమస్యలు, టైప్ 2 దయాబెటిక్ వంటి దీర్ఘకాలిక సమస్యల ముప్పును తగ్గిస్తుంది. తృణధాన్యాలు, పండ్లు, కూరగాయలు, చిక్కుళ్లు, నట్స్ వంటి ఆహారాలు తీసుకోవాలి.

పొటాషియం : ఇది ఒక ఎలక్ట్రోలైట్. రక్తపోటును నియంత్రణలో ఉంచుతుంది. ఆరోగ్యకరమైన కండరాలు, నరాల పనితీరుకు సహాయపడుతుంది. పొటాషియం హైపర్‌టెన్షన్, స్ట్రోక్ ముప్పును తగ్గిస్తుంది. రోజువారీ ఆహారంలో అరటి, కమల, బంగాళదుంపలు, పాలకూర, బీన్స్ వంటి పొటాషియం పుష్కలంగా ఉండే ఆహారాలను తీసుకోవాలి.

విటమిన్–ఎ : ఆడవాళ్ల ఆరోగ్యానికి విటమిన్–ఎ కీలకమైంది. ఇందులో యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఎముకలు, దంతాలు ఆరోగ్యంగా ఉండటానికి 'ఎ' విటమిన్ తీసుకోవటం అత్యంత అవసరం. దీనికోసం టమోటా, క్యారెట్, బొప్పాయి, గుమ్మడికాయ, పాలకూర, చేపలు, పాలు, గుడ్లు, పుచ్చకాయ వంటివి ప్రతిరోజూ తీసుకుంటుండాలి.

విటమిన్–సి : రోగ నిరోధక శక్తికి పెంపొందించుకోవటానికి తప్పకుండా రోజువారీ డైట్‌లో తీసుకోవాలి. ఇది రొమ్ము క్యాన్సర్ వంటి వ్యాధులను నిరోధిస్తుంది. గర్భిణులు, పాలిచ్చే తల్లుల ఆరోగ్యానికి ఇది ఎంతో అవసరం. ఇది సిట్రస్ ఫ్రూట్స్, బంగాళా దుంపలు, స్ట్రాబెర్రీస్, టమాటో, జామ, ఉసిరి వంటి వాటిలో లభిస్తుంది.

విటమిన్–డి : శరీరంలో కాల్షియం పెరుగుదలకు అవసరమైన 'డి' విటమిన్ మహిళల ఆరోగ్యానికి అత్యంత అవసరం. వయస్సుపైబడే కొద్దీ కీళ్ల అరుగుదల, కీళ్ల నొప్పులు వంటివి రాకుండా ఉండేందుకు విటమిన్–డి తీసుకోవటం అవసరం. ఇంటిపట్టునే ఉండే గృహిణుల్లో ఈ విటమిన్ ఎక్కువగా లోపిస్తుంది. అలాంటివాళ్లు రోజుకు కాసేపు ఎండలో ఉండటం అవసరం.

విటమిన్–బి3 : కణాల పనితీరు, పోషకాలను గ్రహించటంలో, నాడీ వ్యవస్థ పనితీరులో 'బి3' విటమిన్ కీలకం. ఇది ట్యూనా చేపలు, వేరుశెనగలు, పుట్టగొడుగులు, గోధుమలు, పాలు, గుడ్లు, బీన్స్ వంటి వాటిలో ఉంటుంది.

విటమిన్–బి6 : హార్మోన్ల ఉత్పత్తికి, మెదడు ఆరోగ్యానికి, రక్తహీనత వంటి సమస్యలను నివారించటానికి విటమిన్–బి6 అవసరం. దీనికోసం డ్రైఫ్రూట్స్, నట్స్, ఎగ్స్, ముడి ధాన్యాలు, బీన్స్, అరటిపండ్లు, మాంసం, ఓట్లు వంటివి తీసుకోవాలి.

విటమిన్–బి9 : ముఖ్యమైన విటమిన్లలో 'బి9' (ఫోలిక్ యాసిడ్) కూడా ఒకటి. ఇది గర్భిణుల ఆరోగ్యానికి మేలు చేస్తుంది. ఒత్తిడి, డిప్రెషన్ వంటి సమస్యలను తగ్గిస్తుంది. ఇది ఆకుకూరలు, బీన్స్, పప్పు ధాన్యాలు, అరటిపండ్లు, చేపల్లో ఎక్కువగా ఉంటుంది.

విటమిన్–బి12 : మహిళల్లో రక్తహీనత తగ్గటానికి విటమిన్–బి12 తీసుకోవడం అవసరం. ఇది రక్త కణాలు ఏర్పడటానికి, మెటబాలిజం రేటును పెంచటానికి పెంచటానికి ఉపయోగపడుతుంది. ఇది చేపలు, పాలు, గుడ్లు, మాంసం, పెరుగు వంటి పదార్థాల్లో అధికం.

# 'ప్రపంచీకరణ.. కరువులు'



'ఎగుమతులకు పనికొచ్చే' పంటలను మరింత ఎక్కువగా పండించాలని భారతీయ రైతులకు ప్రధాని నరేంద్ర మోడీ 1న న్యూఢిల్లీ నుండి పిలుపునిచ్చాడు. మన రైతులు ఆహారధాన్యాల సాగు నుంచి వైదొలగాలని, దేశం ఆహారధాన్యాలను దిగుమతి చేసుకోవాలన్నదే ఆ పిలుపు సారాంశం. ప్రపంచ బ్యాంక్, దాని తరఫున వకాల్తా పుచ్చుకుని ఇక్కడ మాట్లాడే భారతీయ ఆర్థిక శాస్త్రవేత్తలు కొంత కాలంగా ఇస్తున్న సలహా ఇదే. సామ్రాజ్యవాద దేశాలు కోరుతున్నదీ ఇదే. అనేక సంవత్సరాలుగా అమెరికాలో రైతులకు భారీ సబ్సిడీలు ఇస్తున్నారు. ఆ దేశంలో పండే ఆహారధాన్యాల విలువలో దాదాపు సగం మేరకు ఆ సబ్సిడీ ఉంటుంది. దాంతో అక్కడి రైతులు పండించే ఆహారధాన్యాల నిల్వలు కూడా బాగా పేరుకుపోతున్నాయి. వాటిని చెల్లగొట్టుకోవాలంటే భారతదేశం వంటి మార్కెట్లే వారికి దారి. అందుకోసం ఇక్కడి రైతులు ఆహార పంటల సాగు నుండి మారి అమెరికా వంటి దేశాల్లో పండించడం సాధ్యం కాని పంటలను పండించేలా ఒత్తిడి తెస్తున్నారు. సామ్రాజ్యవాదుల ఈ కోరికకు అనుగుణంగానే ఇక్కడ మోడీ రైతులకు సలహా ఇస్తున్నాడు. గతంలో మోడీ ప్రభుత్వం తెచ్చిన మూడు నల్ల వ్యవసాయ చట్టాల సారాంశం కూడా ఇదే. ఆహార పంటల సాగునుండి వైదొలగి సామ్రాజ్యవాద దేశాలకు కావలసిన పంటను పండించేలా రైతులను నెట్టడమే వాటి అసలు ఉద్దేశం. అంతకు ముందు వరకూ కనీస గిట్టుబాటు ధరలు రైతులకు గ్యారంటీ చేసే విధంగా ప్రభుత్వం బాధ్యత వహించి మద్దతు ధరలను ప్రకటించి అమలు చేస్తూ వుండే విధానం ఉండేది. మొదట అటువంటి మద్దతును వ్యాపార పంటల విషయంలో తొలగించారు. ఆ తర్వాత ఆహార పంటల విషయంలోనూ తొలగించడానికి ప్రయత్నించారు.

కాని రైతులు ఏడాదికి పైగా జరిపిన పోరాటం ఫలితంగా ఆ నల్ల చట్టాలను వెనక్కు తీసుకుని మద్దతు ధర విధానాన్ని ఆహార పంటల విషయంలో కొనసాగిస్తున్నారు. ఇది మోడీ ప్రభుత్వానికి కాని, సామ్రాజ్యవాదులకు గాని బొత్తిగా రుచించని విషయం. అందుకే వాళ్ళిద్దరూ తమ ప్రయత్నాన్ని మాత్రం విడిచిపెట్టడం లేదు. తాజాగా మోడీ రైతులకు ఇచ్చిన సలహా ఈ వాస్తవాన్నే ధృవపరుస్తోంది.

ఆహార పంటల నుండి వైదొలగి ఎగుమతులకు పనికివచ్చే పంటల వైపు, అంటే వ్యాపార పంటల వైపు మళ్ళడం వలన నిజానికి రైతులకే ఎక్కువ ప్రయోజనం కలుగుతుందని చెప్తూ ప్రపంచబ్యాంక్ తరఫున వకాల్తా పుచ్చుకున్న వారంతా రైతన్నల ఆందోళన కొనసాగుతున్న కాలమంతా ప్రచారం చేస్తూనే వచ్చారు. రైతులు ఆ విధంగా తమ సాగును మళ్ళించడానికి అవరోధంగా ఉన్నది మద్దతు ధరల విధానం అని, దానిని రద్దు చేస్తే అప్పుడు రైతుల వ్యాపార పంటలవైపు మళుృతారని, దాని వలన వారికి ఎక్కువ ప్రయోజనాలు కలుగుతాయని వారా కాలమంతా పనిగట్టుకుని ప్రచారం చేశారు. కాని రైతులకు కనీస మద్దతు ధర వ్యవస్థ ప్రాధాన్యత బాగా తెలుసు. ఒకసారి ఆ విధానాన్ని గనుక రద్దు చేస్తే ఆ తర్వాత మన రైతులు ప్రపంచ మార్కెట్‌లో ఆహార పంటల ధరల ఎగుడుదిగుడుల మాయాజాలంలో చిక్కుపడిపోతారు. గతంలో వ్యాపార పంటల విషయంలో వారికి వచ్చిన అనుభవం ఇదే. వ్యాపార పంటల ధరల విషయంలో ఆ పంటలు దిగుబడికి వచ్చే సమయంలో అమాంతం వాటి ధరలు పడిపోవడం అనేది మన రైతులకు అనుభవవేద్యమే. దానికి తోడు ఆ వ్యాపార పంటలను సాగు చేయడానికి ఎక్కువ పెట్టుబడులు అవసరమౌతాయి. అందుకోసం భారీ రుణాలు తీసుకోవలసి వస్తుంది. అలా తీసుకున్న రుణాలను ధరల పతనం తర్వాత చెల్లించడం రైతులకు అసాధ్యం అవుతుంది. అలా రుణాలను తీర్చలేని పరిస్థితులు ఏర్పడినందువల్లే గత మూడు దశాబ్దాల కాలంలో వ్యాపార పంటలు పండిచే రైతుల్లో నాలుగు లక్షల మందికి పైగా ఆత్మహత్యలకు పాల్పడ్డారు. అందుచేత రైతులకు ఎంతో కొంత రక్షణ కల్పించే కనీస మద్దతు ధర వ్యవస్థను రద్దు చేయడానికి మోడీ ప్రభుత్వం నల్ల చట్టాల ద్వారా ప్రయత్నించినప్పుడు వారంతా దానిని బలంగా వ్యతిరేకించారు. ఆ మద్దతు ధర వ్యవస్థ గనుక రద్దయితే తమ భవిష్యత్తు ఎలా ఉండబోతోందో వారికి స్పష్టంగా తెలుసు.

కనీస మద్దతు ధర వ్యవస్థ గనుక లేకపోతే ఆహార పంటల సాగునుంచి వ్యాపార పంటల సాగు వైపు మళ్ళడం, అటువంటి వ్యాపార పంటలను పండించిన తర్వాత వాటిరేట్లు పడిపోయి చేసిన అప్పులు తీర్చలేకపో వడం, దేశం మొత్తానికి-రైతాంగంతో సహా- ఆహార భద్రత లేకుండా పోవడం, ఇదంతా కరువుల రూపంలో మన ముందు దర్శనమిస్తుంది. అటువంటి కరువులు చాలా ఆఫ్రికన్ దేశాలలో సంభవించాయి. అక్కడ ఆహార పంటల నుండి వ్యాపార పంటల వైపు ప్రపంచీకరణ వ్యవస్థలో రైతులు మళ్ళడంతో అది కరువులకు దారి తీసింది.

"ప్రమాదకర మార్గం" అన్న తన గ్రంథంలో ఆర్థికవేత్త అమియా కుమార్ బాగ్చీ ఈ కరువులను "ప్రపంచీకరణ కరువులు" అని సరిగ్గా అతికినట్టు వర్ణించారు.

ఈ కరువులు ఎందుకు వస్తాయి కారణాలేమిటి ఒక దేశం ఆహార పంటల సాగును మానేసి దానికి బదులు వ్యాపార పంటలను సాగు చేయడం మొదలుపెడితే, ఆ వ్యాపార పంటల ధరలు పడిపోయిన ఏడాది ఆ దేశానికి విదేశీ మారక ద్రవ్యం రూపంలో రావలసిన ఆదాయం రాకుండా పోతుంది. అలా పడిపోయినప్పుడు తాను ఆహార అవసరాలకు దిగుమతి చేసుకునే ధాన్యాలకు చెల్లించవలసిన విదేశీ మారకద్రవ్యం ఉండదు. వ్యాపార పంటల ధరలతో పోల్చినప్పుడు ఆహార పంటల ధరలలో ఎగుడుదిగుడులు తక్కువగా ఉంటాయి. వ్యాపార పంటల ధరలు పడిపోయినా, ఆహారధాన్యాల ధరలు పడిపోయే అవకాశం తక్కువ. అందుచేత ఆహార ధాన్యాల దిగుమతికి చెల్లించవలసిన విదేశీ మారకద్రవ్యం సరిపడా లేకపోయేసరికి దేశంలో తలసరి ఆహార ధాన్యాల లభ్యత పడిపోతుంది. అప్పుడు కరువు పరిస్థితులు నెలకొంటాయి.

ఏదో ఒక విధంగా ప్రభుత్వం ఏ "సహాయమో" అర్థించి ప్రజలకు కావలసిన ఆహారధాన్యాలను సేకరించిందను కుందాం. అప్పుడు కూడా ఇబ్బంది ఉంటుంది. వ్యాపార పంటలు పండించి దివాలా ఎత్తిన రైతుల దగ్గర ఈ ఆహార ధాన్యాలను కొనుగోలు చేయడానికి సరిపడా ధనం ఉండదు. వారందరికీ ఆహార ధాన్యాలు అందాలంటే అప్పుడు 'సహాయం'తోబాటు రైతులకు వాటిని కొనుగోలు చేయడానికి వీలుగా సబ్సిడీలు కూడా చెల్లించాలి. లేదా ఉచితంగా సరిపడా ఆహారధాన్యాలను వారికి సరఫరా చేయగలగాలి. లేకపోతే కరువును నివారించడం సాధ్యం కాదు.

ఇక్కడ ఇంకో సమస్య కూడా ఉంది. ఆహార పంటల సాగులో లభించే ఉపాధి (కూలీల అవసరం) వ్యాపార పంటలలో ఉండదు. వ్యాపార పంటలవైపు మళ్ళితే వారికి పనులు దొరకవు. అలా వ్యవసాయ పనులు దొరకని కూలీలకు ఆహార ధాన్యాన్ని కొనుగోలు చేసే శక్తి ఉండదు. అందుచేత ఆహార ధాన్యాలు తగినంత దిగుమతి చేసుకోలేని స్థితి ఏర్పడినా, లేక దిగుమతి చేసుకున్న ధాన్యాన్ని కొనుగోలు చేసే శక్తి దిగజారిపోయినా కరువు పరిస్థితులు తప్పవు. అందుచేత దేశ ఆహార భద్రతను దెబ్బతీసి రైతాంగాన్ని వ్యాపార పంటల సాగు వైపు నెట్టడం అనేది దేశాన్ని కరువు కాటకాలలోకి నెడుతుంది. నయా ఉదారవాద వ్యవస్థలో, ముఖ్యంగా మూడవ ప్రపంచ దేశాలలో, ప్రత్యేకించి ఆఫ్రికా దేశాలలో ఇదే జరిగింది. మన దేశం ఇంతవరకూ ఇటువంటి పరిస్థితి ఏర్పడకుండా నివారించగలిగింది. కాని ఇప్పుడు ప్రధాని మోడీ సలహాను రైతాంగం పాటిస్తే మాత్రం నివారించడం సాధ్యపడదు.

ఆహార ధాన్యాల అవసరాలకు దిగుమతుల మీద ఆధారపడడం ఉచితం కాదు అని చెప్పడానికి కేవలం అది కరువుకు దారి తీస్తుందన్న ఒక్కటే కారణం కాదు. ఆహార ధాన్యాల కోసం ప్రధానంగా దిగుమతుల మీద ఆధారపడిన దేశాలకు మరొక ముప్పు కూడా ఉంది. క్యూబా, ఇరాన్, వెనిజులా, రష్యా, ఉత్తర కొరియా వంటి దేశాల ప్రభుత్వాలు తనకు లొంగి నడుచుకోవడం లేదన్న అక్కసుతో వాటిమీద ఏకపక్షంగా అమెరికా ఆంక్షలు విధించింది. ఇంకా చాలా దేశాల మీద కూడా ఈ విధమైన ఆంక్షలు కొనసాగుతున్నాయి. ఈ ఆంక్షల పేరుతో అమెరికా ఆ దేశాలతో వ్యాపారం చేయదు, తక్కిన దేశాలను కూడా వ్యాపారం చేయనివ్వదు. అటువంటి స్థితిలో ఆ ఆంక్షలకు గురైన దేశం గనుక ఆహార ధాన్య అవసరాలకోసం దిగుమతుల మీద ఆధారపడి వుంటే అప్పుడు పరిస్థితి ఏమిటి ఈ ఆంక్షలలో ఆ యా దేశాల విదేశీ మారక నిల్వలను జప్తు చేయడం అనే చర్య కూడా ఒకటి ఉంది. అదే జరిగితే అప్పుడు జరిగే వినాశకర పర్యవసానాలను ఊహించుకోగలమా సామ్రాజ్యవాదాన్ని ఎదిరించి నిలబడడానికి పూనుకున్నప్పుడు గాజాలో ఎంత నరమేథం జరిగిందో, దానిని ఆ సామ్రాజ్యవాద దేశాల ప్రభుత్వాలన్నీ ఎంతగా సమర్థించాయో మనం చూస్తున్నాం. అటువంటప్పుడు సామ్రాజ్యవాదాన్ని ఎదిరించి తలపడడానికి ఎన్ని దేశాలు ముందుకు రాగలుగుతాయి ఇప్పుడు ట్రంప్ సుంకాల యుద్ధం సాగిస్తున్నది మన దేశాన్ని ఆహార ధాన్యాల దిగుమతి మీద ఆధారపడే దేశంగా మార్చడానికే. అదే జరిగితే మన దేశ స్వయం నిర్ణయాధికారం హరించుకుపోవడం ఖాయం. సామ్రాజ్యవాదుల బంటు హోదాకి మన దేశం దిగజారడం అనివార్యం ఔతుంది.రైతులకు ఈ విధంగా ఆహారధాన్యాల సాగునుండి వ్యాపార పంటల సాగు దిశగా మారమని సలహా ఇస్తు న్న మన ప్రధానికి సైతం ఈ విషయం మీద స్పష్టత ఉందా అనుమానమే. మన పాలకుల పరిస్థితి ఇలా ఉండడం కూడా సామ్రాజ్యవాదుల ఒత్తిళ్ళకు తలొగ్గడానికి దోహదం చేస్తుంది.

## పదిహేనేళ్ల నినాదం వెనక చాలా వ్యూహం



విజయవాడ, : జనసేన అధినేత పవన్ కల్యాణ్ పదిహేనేళ్ల నినాదం వెనక చాలా వ్యూహం ఉందంటున్నారు. పవన్ కల్యాణ్ పదే పదే పదిహేనేళ్ల పాటు కూటమి కలసి ఉంటుందని చెబుతూ వస్తున్నారు. అయితే వచ్చే ఎన్నికల నాటికి పవన్ కల్యాణ్ పెట్టే షరతులు కూడా మారతాయంటున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అంటే పవన్ కల్యాణ్ గౌరవంగా వ్యవహరిస్తున్నారు. అదే సమయంలో తనతో పాటు తన కుటుంబ సభ్యులను ఇబ్బందిపెట్టే విధంగా మాట్లాడినా మిత్రధర్మం కోసం పవన్ కల్యాణ్ సహిస్తూ కూటమి విచ్ఛిన్నం కాకపోవడానికి తానే కారణమని గట్టిగా చెప్పదలచుకున్నారు. ఇప్పటి వరకూ మిత్రపక్షాల్లో ఉన్న టీడీపీ నేతలు మాత్రమే జనసేన పై కొంత నోరు జారారుఅదేసమయంలో జనసేన అధినేత పవన్ కల్యాణ్ మాత్రం చాలా వరకూ సంయమనం పాటిస్తూ వస్తున్నారు. అందుకు దూరాలోచన కారణమన్నది రాజకీయ వర్గాల్లో జరుగుతున్న చర్చ. మొన్నటి ఎన్నికల్లో హండ్రెడ్ పర్సెంట్ స్ట్రయిక్ రేట్ తో విజయం సాధించిన ఉప ముఖ్యమంత్రి పదవి చేపట్టగలిగారు. కీలకమైన పంచాయతీరాజ్, అటవీ, పర్యావరణ శాఖ వంటివాటిని ఏరికోరి తీసుకున్నారు. అంతేకాదు కొన్ని విషయాల్లో ప్రభుత్వ నిర్ణయాలను కూడా మంత్రి మండలి సమావేశాల్లో ప్రశ్నిస్తున్నారు. గతంలో అమరావతి రాజధాని రైతుల నుంచి అదనపు భూముల విషయంలో అభ్యంతరాలు తెలపడంతో పాటు ఇటీవల లూలూ సంస్థ పెట్టిన షరతులను కూడా ప్రశ్నించి తాను అవసరమైనప్పుడు ప్రశ్నిస్తానని సిగ్నల్స్ అధికార టీడీపీకి ఇవ్వగలిగారు.మరోవైపు 2024 ఎన్నికల వరకూ ఆయన ఎమ్మెల్యేగా కూడా ఎన్నిక కాలేదు. దీంతో అనుభవం లేకపోవడంతో సీట్ల పంపకంలో గాని, చివరకు మంత్రి పదవుల విషయంలోగాని ఒకింత రాజీ పడ్డారు. తాను తక్కువ సంఖ్యలో సీట్లు తీసుకున్నానని ఆయనకు తెలుసు. జనసైనికులకే కాదు తన అభిమానులకు కూడా అది నచ్చదని తెలిసినా చంద్రబాబు అనుభవానికి పెద్దపీట వేయాలని సహకరించారు. ఇకపై అలా ఉండదంటున్నారు. ఎందుకంటే ఉప ముఖ్యమంత్రిగా ఎటూ వచ్చే ఎన్నికల నాటికి ఐదేళ్ల అనుభవం ఉంటుంది. అందుకే వచ్చే ఎన్నికల్లో షరతులు ఉంటాయన్నది జనసైనికుల నుంచి వినిపిస్తున్నమాట. అలాగే సీట్ల విషయంలోనూ రాజీ ఉండదన్న అభిప్రాయం పార్టీ నేతల నుంచి వ్యక్తమవుతుంది. తనకు కూటమి కలసి ఉండటం ఎంత అవసరమో టీడీపీకి అంతకంటే ఎక్కువ అవసరం కావడంతో ఈరోజు షరతులు వర్తిస్తాయని జనసైనికులు బాహాటంగానే చెబుతున్నారు.

## యాక్టివ్ అయిన కేడర్



విజయవాడ, : వైసీపీ అధినేత జగన్ పార్టీకి కేవలం పదహారు నెలల్లోనూ ఆంధ్రప్రదేశ్ లో కొంత ఊపు కనిపిస్తుందని ఆ పార్టీ నేతలు అంచనా వేసుకుంటున్నారు. అందుకే ఇన్నాళ్లూ బయటకు రాని వారు కూడా ఇప్పుడు వైసీపీకి వచ్చే క్రేజ్ ను చూసి తిరిగి యాక్టివ్ అవుతున్నారు. ఇప్పటి వరకూ వచ్చే ఎన్నికల్లో తిరిగి అధికారం వస్తుందో రాదో అన్న అనుమానంతో ఇంటి గడప దాటని నేతలు కూడా నేడు బయటకు వచ్చి అధికార పార్టీ పై విమర్శలు చేస్తున్నారు. జనం నాడి కొంత తెలియడంతో వారి మనసులు కూడా మారాయంటున్నారు. వైసీపీ అధికారం కోల్పోయిన పదిహేను నెలల నుంచి కనిపించని నేతలు నేడు బయటకు రావడంతో పాటు వైసీపీ ఇచ్చిన కార్యక్రమాలకు కూడా హాజరవుతున్నారు.అదే సమయంలో మీడియా సమావేశాలు కూడా పెట్టి అధికార పార్టీపై విమర్శలు చేస్తున్నారు. నిన్న మొన్నటి వరకూ గుడివాడ అమర్ నాథ్, పేర్ని నాని, జోగి రమేష్, ఆర్కే రోజా, విడదల రజనీ, బొత్స సత్యనారాయణ వంటి నేతలు మాత్రమే మీడియాలో అధికార పార్టీపై విమర్శలు చేయడానికి ముందుండే వారు. కానీ దూరంగా ఉండే ధర్మాన ప్రసాదరావు వంటి నేతలు కూడా బయటకు వస్తున్నారంటే పార్టీకి కొంత హైప్ కనపడుతుందన్న భావన నేతల్లో వ్యక్తమవుతుంది. కేవలం పదహారు నెలల్లోనే వైసీపీ నేతలు ఇంత యాక్టివ్ అయితే రానున్న కాలంలో మరింతగా బయటకు వచ్చి ప్రజల్లోకి వెళతారన్న అంచనాలో కేంద్ర పార్టీ కార్యాలయం కూడా ఉందన్నది వాస్తవం.ముఖ్యంగా జగన్ పర్యటనలకు జనం నుంచి మంచి స్పందన రావడంతో పాటు క్యాడర్ కూడా భయం లేకుండా వచ్చి పాల్గొనడంతో ఈ మార్పునకు కారణమని అంటున్నారు. అనేక అంశాలు వైసీపీకి ప్లస్ గా మారాయన్న లెక్కలు వేసుకుంటున్నారు. ప్రధానంగా గుంటూరు మిర్చి రైతులు, పొదిలి పొగాకు రైతులు, బంగారుపాళ్యంలో చిత్తూరు మామిడి రైతుల కోసం వెళ్లిన పర్యటనతో పాటు పల్నాడు పర్యటన, తాజాగా ఉత్తరాంధ్ర పర్యటన కూడా సక్సెస్ కావడంతో ఒక్కొక్కరుగా నేతలు బయటకు వస్తున్నారు. దీంతో పాటు మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణ అంశంతో పాటు కల్తీ మద్యం ఘటన కూడా తమకు అనుకూలంగా మారుతుందని అంచనా వేసుకుని మరీ నేతలు బయటకు వస్తున్నారని వైసీపీ కీలక నేత ఒకరు చెప్పారు. మొత్తం మీద రానున్న రోజుల్లో వైసీపీ నేతలు ఇక జనం బాట పట్టే అవకాశాలు మాత్రం స్పష్టంగా కనిపిస్తున్నాయి.

## రౌడీషీటర్ వేధింపులతో యువతి ఆత్మహత్య

ఖమ్మం, : తన కోరిక తీర్చాలని కొంతకాలంగా వెంటపడటమే కాకుండా.. రెచ్చిపోయి బలవంతం చేయబోవడంతో మనస్తాపం చెందిన ఆమె ఆత్మహత్యకు పాల్పడింది. వివరాల్లోకి వెళ్తే.. ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం వి.వెంకటాయపాలెం పంచాయతీ జగ్యాతండాకు చెందని బోడ సుశీల(28)పై ఆమె ఇంటి ఎదురుగా ఉండే రౌడీ షీటర్ ధరావత్ వినయ్ కొంతకాలంగా కన్నేశాడు. ఆమెను తరచూ వేధింపులకు గురిచేసేవాడు. ఈ క్రమంలో పత్తి తీసేందుకు సుశీల మరో మహిళతో కలిసి సోమవారం నాడు కొణిజర్ల మండలం అమ్మపాలెం వెళ్లింది. అక్కడ సుశీలను గమనించిన రౌడీషీటర్ ధరావత్ వినయ్ ఆమె దగ్గరకు వెళ్లాడు. తన కోరిక తీర్చాలని వేధింపులకు దిగాడు. సుశీల ప్రతిఘటించడంతో ఆమెపై దాడికి పాల్పడి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. దీంతో మనస్తాపం చెందిన సుశీల ఇంటికి వచ్చిన తర్వాత ఉరేసుకుంది. వినయ్ వేధింపుల వల్లే తన భార్య ఆత్మహత్య చేసుకుందని సుశీల భర్త శివకుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉంటే సుశీల మృతిపై ఆమె బంధువులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సుశీల ఒంటిపై గాయాలు ఉన్నాయని, శవపరీక్షలో వాటిని పరిగణనలోకి తీసుకోలేదని, ఉరేసుకుని మరణించిందని మాత్రమే వైద్యులు చెబుతున్నారని ఆరోపించారు. ఈ కేసును పక్కదారి పట్టిస్తున్నారని ఆందోళనకు దిగారు.

## స్టేట్స్ లో ట్వీట్స్ వార్...

విశాఖపట్టణం, : స్టేట్స్ అండ్ ట్వీట్స్ వార్ నడుస్తూనే ఉంది. ఏపీ, కర్ణాటక మినిస్టర్స్ మధ్య ఇన్వెస్ట్‌మెంట్స్‌పే డైలాగ్ వార్ కొనసాగుతోంది. బెంగళూరులో రోడ్లు బాలేవు..సౌకర్యాలు కల్పించడం లేదని కంపెనీల సీఈవోలు పెట్టిన పోస్టులతో వివాదం మొదలై..లోకేశ్ రెస్పాండ్‌తో హాట్ టాపిక్ అయింది. ఇప్పుడు మరోసారి గూగుల్ డేటా సెంటర్‌పై కర్ణాటక ఐటీ మినిస్టర్ చేసిన ట్వీట్‌కు లోకేశ్ అదే స్థాయిలో రియాక్ట్ కావడం ఆసక్తికరంగా మారింది. కర్ణాటక మంత్రులు ఏపీ ఐటీ మినిస్టర్ లోకేశ్ మధ్య ట్వీట్ వార్ ఇంట్రెస్టింగ్‌గా మారింది. బెంగళూరులో పరిశ్రమలను రన్ చేయలేకపోతున్నామని..అక్కడి నుంచి వెళ్లిపోతామంటూ పలువురు ఇండస్ట్రియలిస్టులు స్టేట్‌మెంట్లు ఇవ్వడం ఆ మధ్య చర్చకు దారితీసింది. ఇదే అదునుగా..ఏపీకి వచ్చేయండి..మీకు రెడ్ కార్పెట్ వెల్‌కమ్ అంటూ లోకేశ్ చేసిన ట్వీట్స్ ఆసక్తికరంగా మారాయి. బెంగళూరులో రోడ్లు, ఇతర సౌకర్యాలు, వసతులపై ఏరో స్పేస్ పార్క్, బ్లాక్ బక్ అనే పరిశ్రమ అసంతృప్తిపై గతంలోనే లోకేశ్ రియాక్ట్ అయ్యారు.ఏరో స్పేస్ పార్క్‌ను అనంతపురంకు..బ్లాక్ బక్ పరిశ్రమలను విశాఖపట్నానికి తరలించాలని కోరారు. దీంతో కర్ణాటక రాజకీయాల్లో కాక రేగింది. కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వం చేతగానితనం వల్లే పరిశ్రమలు ఏపీకి తరలిపోతున్నాయని అక్కడి విపక్షాలు సిద్దరామయ్య సర్కార్‌పై అటాక్ స్టార్ట్ చేయడంతో..15 రోజుల క్రితం పెద్ద రచ్చే అయింది. అప్పటినుంచే ఏపీ, కర్ణాటక మంత్రుల మధ్య ట్వీట్ వార్ మొదలై..ఈ మధ్య కాస్త చల్లబడిందిఇప్పుడు గూగుల్ డేటా సెంటర్‌పై కర్ణాటక ఐటీ మినిస్టర్ ప్రియాంక్ ఖర్గే చేసిన కామెంట్స్ చర్చకు దారి తీస్తున్నాయి. ఏపీ ప్రభుత్వం అడ్డగోలుగా రాయితీలు ఇచ్చి గూగుల్ డేటా సెంటర్‌ను ఏపీకి తెచ్చుకుందన్నారాయన. అన్ని రాయితీలు ఇస్తే ఏ రాష్ట్రం అయినా పెట్టుబడులు తెచ్చుకోవచ్చన్నారు. అంతేకాదు ఏపీ అప్పులు ఇప్పుడు దాదాపు రూ.10 లక్షల కోట్లకు పెరిగాయని, కేవలం ఒక సంవత్సరంలోనే రూ.లక్షా 61 వేల కోట్లకుపైగా అప్పులు తీసుకున్నారని కూడా ప్రియాంక్ ఖర్గే ట్వీట్ చేశారు.ఆంధ్రా ఫుడ్ స్పైసీగా ఉంటుందని..ప్రతి ఒక్కరూ తమ ఆహారంలో కాస్తంత ఘాటు ఉన్నా.. దాన్ని ఆస్వాదిస్తారు. కానీ పోషకాహార నిపుణులు ఆహారంలో సమతుల్యత ఉండాలని సిఫార్సు చేస్తున్నారు. అలాగే ఆర్థికవేత్తలు కూడా బ్యాలెన్స్‌డ్ బడ్జెట్‌ను మెయింటేన్ చేయాలని చెబుతున్నారంటూ ప్రియాంక్ ఖర్గే తన ట్వీట్‌లో చెప్పుకొచ్చారు. ఏపీ ఐటీ మంత్రి లోకేశ్..ప్రియాంక్ ఖర్గేకు కౌంటర్ ఇచ్చారు. ఏపీకి గూగుల్ డేటా సెంటర్ రావడంపై పొరుగు రాష్ట్రాల్లో అలజడి మొదలైందన్నారు. ఆంధ్రా ఆహారం కారంగా ఉంటుందని అంటున్నారని, తమ పెట్టుబడులు కూడా అలాగే అనిపిస్తున్నాయని చురకలు అంటించారు. పొరుగువారికి ఇప్పటికే ఆంధ్రా కారం ఘాటు సెగ తగులుతుందని లోకేశ్ ఇచ్చి పడేశారు.ఈ ట్వీట్ వార్ లో ఏపీ ఐటీ మినిస్టర్ చుట్టూ చర్చ జరుగుతోంది. ఏపీకి ఇన్వెస్ట్‌మెంట్స్ తేవడంలో లోకేశ్ కీరోల్ ప్లే చేస్తున్నట్లుగా ఆయనకు హైప్ క్రియేట్ అవుతోంది. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఇద్దరిలో ఎవరూ కూడా కర్ణాటక మంత్రుల ట్వీట్స్‌పై రియాక్ట్ కావడం లేదు. ప్రియాంక్ ఖర్గే అయినా..డీకే శివకుమార్ వ్యాఖ్యలు చేసినా..లోకేశే వారికి కౌంటర్ ఇస్తున్నారు. ఈ క్రమంలో ఏపీ ఐటీ మినిస్టర్‌గా లోకేశ్ పెట్టుబడులు తెస్తుంటే..కర్ణాటక మంత్రులు అడ్డుకుంటున్నారని..జనాల్లో చర్చ జరుగుతోంది.గూగుల్ డేటా సెంటర్ అగ్రిమెంట్ నుంచి..ఇటు ఏపీలో విపక్ష వైసీపీ విమర్శల దాక..అటు కర్ణాటక మంత్రుల ట్వీట్స్‌తో లోకేశ్ సెంట్రిక్‌గా డిస్కషన్ నడుస్తోంది. అటు ఐటీ ఫీల్డ్‌లోనూ..ఇటు ఏపీ పబ్లిక్‌లోనూ..నేషనల్ మీడియాలోనూ లోకేశ్ ట్వీట్స్‌పై డిస్కషన్ నడుస్తోంది. గూగుల్ డేటా సెంటర్ రాక సందర్భంగా ఎంతగా ప్రచారం చేసుకోవాలో అంతకంటే ఎక్కువే మైలేజ్ పొందే ప్రయత్నం చేస్తోంది కూటమి. పైగా బెంగళూరులో రోడ్లు, సౌకర్యాలు, వసతుల సరిగ్గా లేవని కంపెనీల సీఈవోలు చేస్తున్న ట్వీట్లను లోకేశ్ ప్లస్ పాయింట్‌గా మార్చుకోవడంతో..ఓవరాల్ ఎపిసోడ్‌లో ఏపీ ఐటీ మినిస్టర్ లోకేశ్ హైలెట్ అవుతున్నారన్న టాక్ వినిపిస్తోంది. కర్ణాటక మంత్రులు, ఏపీ మినిస్టర్ లోకేశ్ మధ్య ట్వీట్ వార్‌కు ఎండ్ కార్డ్ పడేదెప్పుడో చూడాలి.

# ఐక్య పోరాటంతోనే రిజర్వేషన్లు



దేశంలో, రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ముసుగులో విద్రోహ పాలన కొనసాగుతున్నది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఎనిమిది దశాబ్దాలు కావస్తున్నా, నేటికీ బలహీనవర్గాలకు, అత్యంత వెనుకబడిన సంచార జాతుల ప్రజలకు రాజ్యాధికారం దక్కడం లేదు. ఇప్పటికీ ఆధిపత్య వర్గాల చేతుల్లో బీసీలు నయవంచనకు గురవుతూనే ఉన్నారు. తెలంగాణలో విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల్లో బీసీలకు వర్గీకరణతో కూడిన 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చి మోసం చేయడమే అందుకు తాజా ఉదాహరణ. బీసీ రిజర్వేషన్లకు సంబంధించిన రెండు బిల్లులను ప్రతిపక్షాల సంపూర్ణ మద్దతుతో చట్టసభల్లో ఆమోదించి, కేంద్ర ప్రభుత్వ ఆమోదం కోసం పంపించిన రాష్ట్ర పాలకులు ఒక పద్ధతి ప్రకారం రిజర్వేషన్లు అమల్లోకి రాకుండా కుట్ర చేస్తున్నారు. ఇది తమను మభ్యపెట్టే ప్రయత్నమని బీసీ సంఘాలు, బీసీ మేధావులు, బీసీ సమాజం పసిగట్టకపోవడం బాధాకరం. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 15 (4), 15 (5), 16 (4) ప్రకారం.. బీసీ కులాలను సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన తరగతులుగా గుర్తించారు. అదే విధంగా స్థానిక సంస్థల్లో ఆర్టికల్ 243 ప్రకారం బీసీ కులాలను వెనుకబడిన పౌరులుగా గుర్తించారు. భారత రాజ్యాంగంలో సరైన విధంగా గుర్తించకపోవడం బీసీ కులాలకు శాపంగా మారింది. రాజ్యాంగంలో బీసీలకు సంబంధించిన ఆర్టికల్స్‌లోని లోపాల ఆధారంగా వెలువడుతున్న సుప్రీంకోర్టు తీర్పులు కూడా బలహీనవర్గాలకు నష్టం చేకూరుస్తున్నాయి. రాజ్యాంగంలో వెనుకబడిన కులాలను వెనుకబడిన తరగతులుగా, వెనుకబడిన పౌరులుగా గుర్తించినందున రాజ్యాంగ సవరణ చేయకుండా, ఇప్పటికిప్పుడు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించలేమని కాంగ్రెస్ పాలకులకు తెలుసు. అయినా, కాంగ్రెస్ పార్టీ గత అసెంబ్లీ ఎన్నికల్లో బీసీ కోటాను 42 శాతానికి పెంచి, వర్గీకరణ ద్వారా రిజర్వేషన్లు అమలుచేస్తామని హామీ ఇచ్చింది. బీసీ వర్గాల ఓట్లతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పాలకులపై రిజర్వేషన్లు కల్పించే బాధ్యత ఉన్నది. కాబట్టి, గతంలో కోర్టులు వెలువరించిన తీర్పుల ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయవచ్చని బీసీ సామాజిక ఉద్యమకారులు, న్యాయ నిపుణులు కాంగ్రెస్ పాలకులకు సూచిస్తున్నారు. ఆ తీర్పులను ఒక్కసారి పరిశీలిద్దాం. 1992లో 9 మంది జడ్జిలతో కూడిన సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో 27 శాతం ఓబీసీ రిజర్వేషన్లకు సంబంధించిన మండల్ కమిషన్ తీర్పును వెలువరించింది. ఇందులో ప్రధానంగా మొత్తం రిజర్వేషన్లు 50 శాతం మించరాదని నిబంధనను విధిస్తూనే.. ఒకవేళ బీసీ గణాంకాలు ఆమోదయోగ్యంగా ఉండి, ప్రత్యేక పరిస్థితుల్లో బీసీల ప్రాతినిధ్యం లేనట్టయితే 50 శాతానికి మించి కూడా రిజర్వేషన్లను అమలు చేసుకోవచ్చని అదే తీర్పులో తెలిపింది. ఈ తీర్పు ప్రకారం బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయవచ్చు కదా?

2022లో బీఆర్ఎస్ సర్కార్ ఎస్టీ రిజర్వేషన్లను 6 నుంచి 10 శాతానికి పెంచడంతో విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు 54 శాతానికి చేరుకున్నాయి. 10 శాతం ఈడబ్ల్యూఎస్ కోటాతో కలిపి రిజర్వేషన్లు 64 శాతానికి చేరుకున్న విషయం అందరికీ తెలిసిందే. అందుకే రాష్ట్ర పాలకులు భారత రాజ్యాంగం ప్రకారం రాష్ట్ర ప్రభుత్వాలు విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లను నిర్ధారించి అమలుచేయాలి. అంతేగానీ, ప్రత్యేకంగా కేంద్ర ప్రభుత్వం అనుమతి అవసరం లేదనే విషయాన్ని గమనించాలి. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం రెండు బీసీ బిల్లులను అమలుచేసి బీసీ కులాలకు విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లను వర్గీకరణ ద్వారా వెంటనే అమలు చేయాలి. ఎందుకంటే అధికార పక్షంతో పాటు రాష్ట్రంలోని అన్ని రాజకీయ పక్షాలు శాసనసభలో ఈ బిల్లులకు మద్దతు తెలిపాయి. రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో రిజర్వేషన్లను అమలు చేస్తే అన్ని రాజకీయ పక్షాలు అండగా నిలుస్తాయనడంలో సందేహం లేదు. ఒకవేళ ఈ విషయంలో ఎవరైనా పార్టీపరంగా గాని, సంస్థలపరంగా గాని, వ్యక్తుల పరంగా గాని హైకోర్టు, లేక సుప్రీంకోర్టులో కేసులు వేసినట్టయితే, రాష్ట్ర బీసీ జాబితాలో అత్యంత వెనుకబడిన సంచార జాతుల కులాలు ఇప్పటి వరకు ఎలాంటి రాజ్యాంగపరమైన రిజర్వేషన్లు పొందలేదని, వారికి పదవులు దక్కలేదని కోర్టులకు తెలపాలి. అలాగే సామాజికపరమైన రిజర్వేషన్ ఫలితాలు వీరి దాకా చేరనేలేదనే విషయాన్ని తెలియజేయాలి. బుడబుక్కల, దాసరి, దొమ్మర తదితర కులాలవారు రాష్ట్ర ప్రభుత్వ గెజిట్‌లో ఉన్నాయని ఇప్పటి వరకు పాలకులకు, 99 శాతం మంది అధికారులకు తెలియదు. ఈ కులాల అభ్యున్నతికి ఇకనైనా పాటుపడకపోతే ఎలా? విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల్లో ఈ కులాల ప్రాతినిధ్యాల లెక్కలను కోర్టుల ముందుపెట్టి రిజర్వేషన్లను సాధించాలి. మ్యానిఫెస్టోలో హామీ ఇచ్చినట్టుగా వర్గీకరణతో కూడిన రిజర్వేషన్లు కల్పించాలి. లేకపోతే కాంగ్రెస్ పార్టీని బీసీ వర్గాలు మరోసారి నమ్మవు. అదేవిధంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చొరవ తీసుకొని బీసీ రిజర్వేషన్లపై న్యాయ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలి. అందుకోసం రాజ్యాంగాన్ని సవరించాలి. తద్వారా దేశవ్యాప్తంగా ఉన్న బీసీల సమస్యను శాశ్వతంగా తీర్చాలి. రాజ్యాంగంలో విద్య, ఉద్యోగ ఇతర అంశాలకు సంబంధించిన అధికరణల్లో బీసీ తరగతులను సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన కులాలుగా గుర్తించాలి. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లకు సంబంధించిన అధికరణల్లో కూడా సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన కులాలుగా గుర్తించాలి. ఐక్యకార్యాచరణతో రాజకీయ చైతన్య యుద్ధానికి బీసీలు సిద్ధం కావాలి. సాధించే వరకు పోరాటం

## శబరిమలకు పోటెత్తిన భక్తులు

కేరళలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శబరిమలకు భక్తులు పోటెత్తారు. స్వామి దర్శనానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వేల సంఖ్యలో తరలివస్తున్నారు. దీంతో కొండ మొత్తం అయ్యప్ప నామస్మరణతో మార్మోగిపోతోంది. ఈ ఏడాది మండల– మకరవిళక్కు వేడుకలు ప్రారంభమైన విషయం తెలిసిందే. రెండు నెలల పాటు సాగే దర్శనాల కోసం కేరళ నుంచే కాకుండా పొరుగున ఉన్న తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు శబరిమల కొండకు తరలివెళ్తున్నారు. లక్షలాది మంది మండల దీక్షాపరులు ఇరుముడులతో శబరిమల కొండకు వస్తున్నారు. మరోవైపు భక్తుల రద్దీ దృష్ట్యా ట్రావన్‌కోర్ దేవస్థానం బోర్డు అన్ని ఏర్పాట్లూ చేసింది.



## మాదకద్రవ్యాల నిరోధక అవగాహన కార్యక్రమం

### జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆకస్మిక తనిఖీ


కొడిమ్యాల: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ప్రమోద్ కుమార్ కొడిమ్యాల మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఓపి రిజిస్టర్స్ రికార్డులను పరిశీలించారు. ఫార్మసీ రూమ్‌లో అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచుకో వాలని, మందులను ఎక్స్పైరీ డేట్ చూసుకుంటూ పేషెంట్స్ కి ఇవ్వవలెనని తెలిపారు. తర్వాత ఇమ్యునైజేషన్ గదిని పరిశీలించారు. పిల్లలకు ఇచ్చే టీకాలను సరైన టెంపరేచర్ నందు భద్రపరచవలనని సూచించారు. ల్యాబ్ ను పరిశీలించి పేషెంట్స్ కి అవసరమైన రక్త పరీక్షలు చేసి తగిన మందులు ఇవ్వవలెనని చెప్పారు. మాదకద్రవ్యాలు వాడడం వలన ఆరోగ్యం దెబ్బతింటుందని, జీవితాలు కోల్పోతారని, కుటుంబాలు విచ్ఛిన్నమవుతాయని జరిగే అనర్థాల గురించి ప్రజలకు సిబ్బందికి అవగాహన కల్పిస్తూ సిబ్బంది ప్రజల చేత మాదకద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ చేయించారు. ఇట్టి కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ప్రమోద్ కుమార్ తో పాటు జిల్లా ఇమ్యూనైజేషన్ ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాస్ మండల వైద్య అధికారులు డాక్టర్ నరేష్, డాక్టర్ పరమేశ్వరి, డిపిఓ (ఎన్సిడి) రవీందర్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రాజశేఖర్, జిల్లా సీనియర్ అసిస్టెంట్ కుతుబుద్దీన్, సత్యప్రసాద్, సూపర్వైజర్లు వెంకట నరసమ్మ, అలివేలు, ఫార్మసీ ఆఫీసర్, నర్సింగ్ ఆఫీసర్స్, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు

## ఊడ్చే యంత్రాలతో ఖజనా ఊడ్చేశారు...

హైదరాబాద్, : సాధారణంగా పారిశుధ్యానికి నగరపాలక సంస్థలు భారీగా ఖర్చు పెడుతుంటాయి. ఒకప్పుడు పారిశుద్ధ్య నిర్వహణ మొత్తం మనుషులు చేసేవారు. అయితే నగరాలు విస్తరించడం వల్ల.. శివారు ప్రాంతాలు పెరిగిపోవడం వల్ల పారిశుద్ధ్య నిర్వహణ మనుషుల వల్ల కావడం లేదు. అందుకే నగరపాలక సంస్థలు చెత్త ఊడ్చడానికి ఖరీదైన యంత్రాలను అందుబాటులోకి తీసుకొస్తున్నాయి. వీటిని కొనుగోలు చేయాలంటే భారీగా డబ్బులు కావాలి. అందువల్లే అవి అద్దె ప్రాతిపదికన తీసుకొస్తుంటాయి. ఇంతవరకు బాగానే ఉన్నా.. ఇప్పటికి చెల్లించే అదే భారీగా ఉంటున్నది. వాస్తవానికి ఆ స్థాయిలో చెల్లించే అద్దె ద్వారా కొత్త యంత్రాలు కొనుగోలు చేయవచ్చు. కానీ నగరపాలక సంస్థల్లో వ్యవహారం వేరే విధంగా ఉంటుంది కాబట్టి వందల కోట్లలో అద్దె చెల్లించడానికి సిద్ధంగా ఉంటారు. మనదేశంలో ప్రఖ్యాత నగరపాలక సంస్థల్లో బెంగళూరు ఒకటి. బెంగళూరు నగరం మనదేశ ఐటీ రాజధానిగా పేరుపొందింది. ఇక్కడ అనేక బహుళజాతి సంస్థలు కార్యకలాపాలు సాగిస్తున్నాయి. గతంతో పోల్చి చూస్తే బెంగళూరు నగరం కూడా విపరీతంగా పెరిగింది. పెరిగిన నగరానికి తగ్గట్టుగానే సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత నగరపాలక సంస్థ మీద పడింది. వాస్తవానికి బెంగళూరులో రోడ్లు చాలా చిన్నవిగా ఉంటాయి. ఇక సాయంత్రం పూట ట్రాఫిక్ చెప్పాల్సిన పనిలేదు. వర్షం కురిస్తే మాత్రం నరకం కనిపిస్తుంది. బెంగళూరులో ప్రతిరోజు చెత్త భారీగా పోగుపడుతుంది. ఇలా పోగు పడిన చెత్తను శుభ్రం చేయాలంటే కార్మికులకు తలకు మించిన భారమవుతోంది. ఏటికేడు ఈ సమస్య పెరిగిపోతున్న నేపథ్యంలో నగరపాలక సంస్థ ఒక కీలక నిర్ణయం తీసుకుంది. అయితే ఈ నిర్ణయం 613 కోట్ల విలువైనది. ఇంతటి డబ్బు పెట్టి కొత్త యంత్రాలు కొనుగోలు చేస్తున్నారనుకుంటే పొరపాటే.బెంగళూరు నగరపాలక పరిధిలో చెత్తను శుభ్రం చేయడానికి.. రోడ్లను ఊడ్చడానికి ఏకంగా 46 స్వీపింగ్ యంత్రాలను బెంగళూరు నగరపాలక సంస్థ అధికారులు అద్దెకు తీసుకున్నారు.

ఏడు సంవత్సరాలపాటు ఈ యంత్రాలను వాడుకునే విధంగా ఒప్పందాలు కుదుర్చుకున్నారు. వాస్తవానికి కర్ణాటక రాజధాని అయిన బెంగళూరు నగరంలో పారిశుద్ధ్యాన్ని పరిరక్షించడానికి తీసుకున్న నిర్ణయం అభినందనీయమైనప్పటికీ.. ఇంతటి ఖర్చుపెట్టి.. అది కూడా యంత్రాలను అద్దెకు తీసుకోవడం ఎంతవరకు సమంజసం అని నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు. కాంగ్రెస్ పరిపాలనలో ఇలాంటివి సహజమేనని వ్యాఖ్యానిస్తున్నారు.

## బీజేపీ పెద్దలకు దగ్గరవుతున్న చంద్రబాబు



విజయవాడ, : ఏపీ సీఎం చంద్రబాబుకేంద్ర పెద్దల వైఖరి పూర్తిగా మారిపోయిందని చెప్పవచ్చు. 2024 ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత చంద్రబాబు ప్రాధాన్యం కేంద్రంలో పెరిగింది. దానికి కారణం ఎన్డీఏలో కీలక భాగస్వామిగా ఉండి.. మోదీ మూడోసారి ప్రధాని అయ్యేందుకు అవసరమైన సంఖ్యా బలాన్ని అందించగలిగింది తెలుగుదేశం పార్టీ. అయితే గత అనుభవాల దృష్ట్యా చంద్రబాబు కేంద్ర పెద్దలతో చాలా సఖ్యతగా మెలుగుతూ వచ్చారు. గతానికి భిన్నంగా వ్యవహరిస్తున్నారు. ఏ విషయంలోనూ గాబరా పడటం లేదు. కేంద్రంతో ఇబ్బందులు తెచ్చుకునే పరిస్థితి లేదు. అయితే ఈ కేంద్ర పెద్దలతో నమ్మదగని మిత్రుడు అనిపించుకున్నారో.. అదే పెద్దలతో శభాష్ అంటూ చప్పట్లు కొట్టించుకుంటున్నారు. విశాఖ పెట్టుబడుల సదస్సులో అయితే కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ చంద్రబాబుకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఏపీ సీఎం మాట్లాడుతున్నంతసేపు తన చప్పట్లతో ప్రోత్సాహం అందిస్తూ వచ్చారు. అలాగని ఆయన ఏదో ఒక డమ్మీ కేంద్రమంత్రి కాదు. అక్షరాల ప్రధాని నరేంద్ర మోడీ కోర్ టీం లో ఉన్న నేత.2018లో ఎన్డీఏనుంచి దూరమయ్యారు చంద్రబాబు. అప్పటివరకు కేంద్ర ప్రభుత్వంతో భాగస్వామ్యమై పనిచేసిన ఆయన.. ఉన్నఫలంగా కేంద్ర ప్రభుత్వానికి దూరమయ్యారు. ఏపీకి ప్రత్యేక హోదా విషయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ట్రాప్ లో పడ్డారు. ఆ సమయంలో కేంద్ర పెద్దలతో ఢీ కొట్టినంత పని చేశారు. అప్పుడే ఏపీలో చంద్రబాబు పని పట్టాలని కేంద్ర పెద్దలు నిర్ణయించుకున్నారు. కేంద్రానికి చెందిన ప్రత్యేక టీం ఏపీలో పనిచేసింది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అద్భుత విజయం వెనుక బిజెపి వ్యూహాలు ఉన్నట్లు అప్పట్లో టిడిపి అనుమానించింది. అయితే 2019 నుంచి 2024 మధ్య ప్రతి పరిణామాన్ని గుణపాఠంగా మార్చుకుంది టిడిపి. తన తప్పు తెలుసుకున్న చంద్రబాబు కేంద్ర పెద్దలతో సఖ్యత ఏర్పాటు చేసుకున్నారు. అయితే ఇప్పటికీ కేంద్ర పెద్దలు చంద్రబాబును నమ్మడం లేదన్న ప్రచారానికి చెక్ చెబుతూ.. కేంద్రమంత్రి పీయూష్ గోయల్ చంద్రబాబుకు అభినందనలతో ముంచెత్తడం విశేషం.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో.. సిఐఐ నేతృత్వంలో విశాఖలో పెట్టుబడుల సదస్సు జరిగింది. దాదాపు 13 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు వచ్చాయి. అయితే కేంద్ర ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తోంది అని ఈ పెట్టుబడుల సదస్సుతో తేలిపోయింది. గత కొద్ది రోజులుగా ప్రపంచ దిగ్గజ సంస్థలు ఏపీకి వస్తున్నాయి. భారీగా పెట్టుబడులు పెడుతున్నాయి. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు సైతం ఏర్పాటు అవుతున్నాయి. తద్వారా ఏపీకి తమ సాయం ఉంటుందని కేంద్రం స్పష్టమైన సంకేతాలు పంపుతోంది. 2014 నుంచి 2024 వరకు ఏపీ విషయంలో కేంద్రం నుంచి అసంపూర్ణ సహకారం అందేది. కానీ గడిచిన 17 నెలల కాలంలో కేంద్రం వైఖరి చూస్తుంటే ఏపీ పట్ల పూర్తి ఉదారస్వభావం చూపుతున్నట్లు అర్థమవుతోంది. స్వయంగా ప్రధానికి అత్యంత సన్నిహితుడు అయిన పీయూష్ గోయల్ ఏపీ సీఎం చంద్రబాబు పట్ల చూపుతున్న గౌరవం చూస్తుంటే మాత్రం.. బిజెపి పెద్దలకు అత్యంత ఇష్టుడైన నాయకుడిగా చంద్రబాబు అవతరించారని అనడంలో ఎటువంటి అతిశయక్తి లేదు.

## శభాష్ టీచర్

**- కుటుంబ కలహాలతో నిరాశ్రయులైన విద్యార్థికి, తల్లికి సాయం**
**- ఉపాధ్యాయులకు కేరళ విద్యాశాఖ మంత్రి ప్రశంస**



న్యూఢిల్లీ: కేరళ ఉపాధ్యాయులు పిల్లలకు అక్షరాలు నేర్పించడమే కాదు.. వారికి అండగా నిలబడుతున్నారు. కుటుంబ కలహాలతో ఇంటిలోకి అనుమతించకపోవడంతో నిరాశ్రయులైన ఆరో తరగతి విద్యార్థి, ఆయన తల్లికి సహాయం చేసి, భద్రత కల్పించిన ఉపాధ్యాయులను కేరళ విద్యాశాఖ మంత్రి వి శివన్‌కుట్టి ప్రశంసించారు. ఎర్నాకుళం జిల్లా తిరుమరడిలో ప్రభుత్వం పాఠశాల తరగతి గదిలో అనేక ప్లాస్టిక్ శీతల పానీయాల సీసాలు వదిలేసినట్లు ఉపాధ్యాయులు కనుగొన్న తరువాత ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. ప్రతిరోజూ జ్యూస్ బాటిల్ కొనే విద్యార్థి, ఆ బాటిళ్లను వదిలి వెళ్లేవాడని విచారణలో తేలింది. కౌన్సెలింగ్ సమయంలో ఆ విద్యార్థి తన తల్లి రోజూ ఇచ్చే రూ.20తో బతికేవాడినని, ఇంట్లో తనకు ఆహారం దొరకడం లేదని ఉపాధ్యాయులకు చెప్పాడు. తదుపరి విచారణలో విద్యార్థి తల్లిదండ్రుల మధ్య వివాదం జరిగిందని, ఆయన నాన్నమ్మ చాలా రోజులుగా తల్లిని, బిడ్డను ఇంట్లోకి రానివ్వటం లేదని తేలింది. కొన్ని రోజులుగా ఆ పిల్లవాడు, ఆయన తల్లి ఇంటి బయట గుబురుగా ఉన్న ప్రాంతంలో తాత్కాలిక షెడ్డులో నివసిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఉపాధ్యాయులు చైల్డ్‌లైన్, పోలీసుల సహాయంతో తల్లిదండ్రులు, అత్తమామలతో మాట్లాడి అన్ని సమస్యలను పరిష్కరించారు. ఆ విద్యార్థిని, ఆయన తల్లిని ఇటీవల తండ్రి, నాన్నమ్మ తిరిగి ఇంట్లోకి అనుమతించారు. తిరుమరడిలోని ఉపాధ్యాయులు మానవత్వానికి ఆదర్శప్రాయమైన నమూనాను ప్రదర్శించారని విద్యాశాఖ మంత్రి శివన్‌కుట్టి అన్నారు. 'ఈ ఘటన మన ప్రభుత్వ విద్యాసంస్థలు విద్యార్థుల భద్రత, శ్రేయస్సును నిర్ధారించడంలో ఎంత నిబద్ధతతో ఉన్నాయో చూపిస్తోందని, పాఠ్యాంశాల పరిమితులను దాటి చాలా దూరం వెళ్తుంది. కౌన్సెలింగ్ సమయంలో ఆరో తరగతి విద్యార్థి ఎదుర్కొంటున్న బాధను గుర్తించడం అభినందనీయం. ప్రధానోపాధ్యాయుడు, ఇతర ఉపాధ్యాయులు సకాలంలో జోక్యం చేసుకోవడంతో ఆ బిడ్డ, తల్లి ఇంటికి తిరిగి వెళ్లడానికి సురక్షితమైన వాతావరణం ఏర్పడింది' అని అన్నారు. 'ప్రతి విద్యార్థి సురక్షితంగా ఉండేలా చూసేందుకు రాత్రింబవళ్లు అవిశ్రాంతంగా పనిచేస్తున్న ఉపాధ్యాయులందరికీ ప్రభుత్వ విద్యాశాఖ తరపున నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. మీరు కేవలం అక్షరాలు నేర్పించడం మాత్రమే కాదు. మీరు వారి జీవితాల్లో ప్రేమ, కరుణ వంటి గొప్ప పాఠాలను బోధిస్తున్నారు' అని పేర్కొన్నారు. సమస్య పరిష్కారమైన తరువాత తల్లీబిడ్డ తమ కృతజ్ఞతలు తెలియజేయడానికి పాఠశాలకు వెళ్లారు. ప్రధానోపాధ్యాయుడు, తరగతి ఉపాధ్యాయుడిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, పంచాయతీ అధికారులు ఆ చిన్నారి ఇంటికి వెళ్లి తమ మద్దతును అందించారు.

## క్రమంగా తగ్గుతున్న బంగారం ధరలు

### రూ.1.25 లక్షల వద్ద కొనసాగుతున్న తులం రేటు

హైదరాబాద్: దేశీయంగా పసిడి ధరలు క్రమంగా దిగొస్తున్నాయి. అంతర్జాతీయ ధరలను అనుసరించి దేశీయంగానూ బంగారం ధరలుతగ్గుముఖం పట్టాయి. మధ్యాహ్నం హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 10 గ్రాముల మేలిమి బంగారం ధర రూ.1.25 లక్షలు పలుకుతోంది. అదే సమయంలో 22 క్యారెట్ల బంగారం రూ.1.14 లక్షల వద్ద కొనసాగుతోంది. అటు వెండి ధర సైతం కిలో రూ.1.56 లక్షలుగా ఉంది. అంతర్జాతీయ ధరలకు అనుగుణంగా బంగారం ధరలు ఎప్పటికప్పుడు మారుతూ ఉంటాయి. ఈనెల 13వ తేదీన 10 గ్రాముల పసిడి రూ.1.30 లక్షల వద్ద ఉంది. ఐదు రోజుల వ్యవధిలో రూ.5వేల మేర తగ్గింది. వెండి కిలో రూ.1.70 లక్షలు ఉండేది. అప్పటితో పోలిస్తే దాదాపు రూ.15వేలు తగ్గింది. అప్పట్లో అంతర్జాతీయంగా ఔన్సు బంగారం 4200 డాలర్లుగా ఉండగా.. ఇప్పుడు 4010 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. వెండి ప్రస్తుతం ఔన్సు 49 డాలర్లుగా ఉంది. ఈ ధరలను అనుసరించి దేశీయంగానూ ధరలు తగ్గుముఖం పట్టాయి. సాధారణంగా బంగారానికి, అమెరికాలోని వడ్డీ రేట్లకు విలోమ సంబంధం ఉంటుంది. ఫెడ్ వడ్డీ రేట్లు పెంచినప్పుడు బంగారం ధర పడుతుంది. తగ్గినప్పుడు పెరుగుతుంది.

ఈ నేపథ్యంలో ప్రస్తుతం అమెరికా డాలర్ బలపడటం, వచ్చే నెల ఫెడ్ వడ్డీ రేట్లు తగ్గిస్తుందన్న అంచనాలు క్షీణించడంతో పసిడికి డిమాండ్ తగ్గింది. దీనికితోడు డాలర్ ఇండెక్స్ బలపడడమూ మరో కారణమని అనలిస్టులు పేర్కొంటున్నారు. అమెరికా ప్రభుత్వ షట్‌డౌన్ ముగిసిన నేపథ్యంలో కీలక ఎకనామిక్ డేటా ఈ వారం వెలువడనుంది. ఫెడ్ గత మీటింగ్‌కు సంబంధించిన మినిట్స్, సెప్టెంబర్ నెలకుసంబంధించి జాబ్స్ డేటా ఈ బుధ, గురువారాల్లో వెలువడనుంది. ఈ డేటా ఫెడ్ వడ్డీ రేట్ల నిర్ణయాన్ని, బంగారం ధరలను ప్రభావితం చేయనుంది. వాస్తవానికి వచ్చే నెలలో మరోమారు వడ్డీ రేట్లలో కోత ఉంటుందని తొలుత అంచనాలు ఉన్నప్పటికీ.. ఫెడ్ అధికారులు మాత్రం దీనిని తోసిపుచ్చుతున్నారు.

# అమెరికాలో భారీగా తగ్గిన భారత విద్యార్థుల అడ్మిషన్లు!



**- వీసా సమస్యలే ప్రధాన కారణమని వెల్లడించిన నివేదిక**
**- హెచ్-1బీ వీసాలపై మరింత కఠినంగా వ్యవహరిస్తున్న ట్రంప్ ప్రభుత్వం**
**- ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతున్న విదేశీ విద్యార్థుల తగ్గుదల**
**- వేలాది మంది అంతర్జాతీయ విద్యార్థుల వీసాలను రద్దు చేసిన యూఎస్**

న్యూఢిల్లీ: అమెరికాలో ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే భారతీయ విద్యార్థులకు ప్రతికూల పరిస్థితులు ఎదురవుతున్నాయి. 2024-25 విద్యా సంవత్సరంలో భారత విద్యార్థుల గ్రాడ్యుయేట్ ప్రవేశాలు 10 శాతం మేర తగ్గాయని అమెరికా స్టేట్ డిపార్ట్‌మెంట్ నిధులతో రూపొందించిన తాజా నివేదిక వెల్లడించింది. ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్ సోమవారం విడుదల చేసిన "ఓపెన్ డోర్స్" నివేదిక ప్రకారం 2025 ఫాల్ సెషన్‌లో అంతర్జాతీయ విద్యార్థుల ప్రవేశాలు ఏకంగా 17 శాతం తగ్గాయి. సర్వేలో పాల్గొన్న 825 అమెరికన్ విశ్వవిద్యాలయాల్లో 61 శాతానికి పైగా సంస్థలు భారత విద్యార్థుల నమోదులో క్షీణత కనిపించిందని తెలిపాయి. వీసా దరఖాస్తుల విషయంలో ఎదురవుతున్న సమస్యలు, ప్రయాణ ఆంక్షలే ఈ తగ్గుదలకు ప్రధాన కారణాలని 96 శాతం యూనివర్సిటీలు అభిప్రాయపడ్డాయి. అయితే, 2024-25లో అమెరికాకు అత్యధిక విదేశీ విద్యార్థులను పంపిన దేశంగా భారత్ ఇప్పటికీ అగ్రస్థానంలోనే కొనసాగుతోంది. మొత్తం విద్యార్థుల సంఖ్యలో 10 శాతం పెరుగుదల ఉన్నప్పటికీ, గ్రాడ్యుయేట్ కోర్సుల్లో మాత్రం క్షీణత నమోదైంది. ఇటీవలి కాలంలో ట్రంప్ ప్రభుత్వం అంతర్జాతీయ విద్యార్థులపై నిఘా పెంచడం, హెచ్-1బీ వీసాల దుర్వినియోగంపై 170కి పైగా విచారణలు ప్రారంభించడం వంటి చర్యలు ఈ పరిస్థితికి కారణంగా కనిపిస్తున్నాయి. కొత్తగా హెచ్-1బీ దరఖాస్తులకు లక్ష డాలర్ల ఫీజును ప్రతిపాదించడాన్ని వైట్ హౌస్ సమర్థించింది. ఈ విధానం ద్వారా అమెరికన్ల ఉద్యోగాలను కాపాడగలమని వైట్ హౌస్ ప్రతినిధి టేలర్ రోజర్స్ తెలిపారు.మరోవైపు, రిపబ్లికన్ చట్టసభ సభ్యులు హెచ్-1బీ కార్యక్రమాన్ని పూర్తిగా రద్దు చేయాలని ఒత్తిడి తెస్తున్నారు. జనవరి నుంచి ఇప్పటివరకు సుమారు 6,000 మంది అంతర్జాతీయ విద్యార్థుల వీసాలను స్టేట్ డిపార్ట్‌మెంట్ రద్దు చేసింది. అమెరికా ఆర్థిక వ్యవస్థకు అంతర్జాతీయ విద్యార్థులు ఏటా దాదాపు 55 బిలియన్ డాలర్లను అందిస్తూ, 3.55 లక్షల ఉద్యోగాలకు మద్దతుగా నిలుస్తున్నారని వాణిజ్య శాఖ గణాంకాలు చెబుతున్నాయి. తాజా పరిణామాలు ఈ ఆర్థిక వనరులపై ప్రభావం చూపే అవకాశం ఉంది.

# డెలివరీ బాయ్స్ స్థానంలో డ్రోన్లు..

## గిగ్ వర్కర్స్‌పై ఏఐ పిడుగు!

## లక్షల మంది వీధిన పడే ప్రమాదం



న్యూఢిల్లీ: కృత్రిమ మేధస్సు నిపుణులైన ఉద్యోగులకు ప్రత్యామ్నాయంగా మాత్రమే కాకుండా సాధారణ ఉద్యోగుల ఉసురు తీసేందుకు సైతం సిద్ధమవుతున్నది. అనేక సాఫ్ట్‌వేర్ సంస్థలలో నిపుణులైన సిబ్బందికి ప్రత్యామ్నాయంగా ఇప్పటికే అనేక రంగాలను ఆక్రమిస్తున్న ఏఐ.. త్వరలో డెలివరీ బాయ్స్ స్థానాన్ని కూడా ఆక్ర మించనున్నది. అమెజాన్, జెప్టో, బ్లింకిట్, డిస్ట్రిక్ట్, స్విగ్గీ, జొమాటో వంటి డెలివరీ సంస్థలు.. మనం ఆర్డర్ చేసిన వస్తువులను 10 నిమిషాల్లో మన ఇంటి ముందుకు తెస్తున్నాయి. ఇందుకోసం ఆయా సంస్థలు డెలివరీ బాయ్స్‌ను వినియోగిస్తున్నాయి. కాగా.. ఈ డెలివరీ బాయ్స్ స్థానాన్ని త్వరలో డ్రోన్లు ఆక్రమించనున్నాయి. ఇదే జరిగితే ఈ వృత్తిపై ఆధారపడి ఉపాధి పొందుతున్న కొన్ని లక్షల మంది వీధిన పడే ప్రమాదం పొంచి ఉన్నది. ఇప్పటికే గుర్గావ్, బెంగళూరు వంటి నగరాల్లో వస్తువుల బట్వాడాకు పలు సంస్థలు డ్రోన్లనే వినియోగిస్తున్నాయి. ఉద్యోగులతో పోల్చుకుంటే అత్యంత వేగంగా, అతి తక్కువ ఖర్చుతో డ్రోన్లు పనిచేస్తున్నాయి. అమెజాన్ సంస్థ అమెరికాలోని తన గోదాములలో ఇప్పటికే ఉద్యోగులను తొలగించి వారి స్థానంలో ఏఐతో పనిచేసే రోబోలను ప్రవేశపెట్టింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సైతం ఈ యాంత్రీకరణకు మద్దతునిస్తున్నాయి.


**ఉద్యోగ భద్రత లేదు..:** డెలివరీ బాయ్స్‌గా పనిచేస్తున్న వారికి ఇప్పటికే ఎటువంటి ఉద్యోగ, ఆరోగ్య భద్రత లేదు, పీఎఫ్ సదుపాయం లేదు. పని మానేసిన రోజున ఎటువంటి బెనిఫి ట్స్ చేతికందవు. రోజుకు 12 నుంచి 15 గంటలు పని చేస్తున్నా వారికి ఉద్యోగ భద్రత లేదు. ఒక్కరోజు పనికి వెళ్లకపోతే.. ఆ రోజుకు ఎటువంటి భత్యం అందదు. **ప్రభుత్వ పథకాలు తెలియవు:** దేశంలో కోటిమందికిపైగా ఉన్న గిగ్ వర్కర్లకు కేంద్ర ప్రభుత్వం ఇటీవల కొన్ని సదుపాయాలను ప్రకటించింది. ఈ-శ్రమ్ పోర్టల్‌లో తమ పేర్లు నమోదు చేసుకోవాలని కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వశాఖ సూచించింది. అలా నమోదైన వారికి ఆయుష్మాన్ భారత్, ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన సదుపాయాలను కల్పిస్తామని తెలిపింది. అయితే వీటి గురించి చాలామంది గిగ్ వర్కర్లకు తెలియదని గిగ్ వర్కర్స్ యూనియన్ సమన్వయకర్త నిర్మల్ గౌరానా చెప్పారు. వారు తమ రోజువారీ ఉపాధిపైనే దృష్టి కేంద్రీకరిస్తారని ప్రభుత్వ పథకాల గురించి వారికి తెలియదని అన్నారు. వారు పనిచేస్తున్న కంపెనీ వారిని రోడ్డున పడేస్తే,పరిహారం అడిగే హక్కు కూడా వారికి లేదని చెప్పారు. **డ్రోన్లపై జీఎస్టీ తగ్గింపు..:** గుర్గావ్, బెంగళూరు నగరాల్లో డ్రోన్లు సరుకుల తోపాటు ఔషధాలు, పార్సిల్స్‌ను కూడా ఇండ్ల వద్దకు తెచ్చి అందిస్తున్నాయి. ప్రభుత్వం మానవరహిత డ్రోన్లపై జీఎస్టీని 28 శాతం నుంచి 5 శాతానికి తగ్గించింది. దీంతో డ్రోన్ల కొనుగోలు భారీగా పెరగనున్నది. దీంతో గిగ్‌వర్కర్లు, డెలివరీ బాయ్స్ వంటి చిరుద్యోగాలను సైతం అవే ఆక్రమించనున్నాయి.

**ఫుల్‌టైమ్ పనిగానే..:** మన దేశంలో 1.2 కోట్ల మంది గిగ్ వర్కర్లు (డెలివరీ బాయ్స్ వంటివారు) ఉండగా.. వీరి సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నది. మరో పదేండ్లలో ఏఐ వీరందరినీ రోడ్డున పడేయవచ్చని పరిశీలకుల అంచనా. చాలా దేశాల్లో పేద, మధ్య తరగతివారు పార్ట్‌టైమ్‌పనిగా ఈ జాబ్స్ చేస్తుంటారు. కానీ భారత్‌లో యువత ఫుల్‌టైమ్ పనిగానే ఈ ఉపాధిని ఎంచుకుంటున్నది. ఒకవేళ ఏఐతో జరిగే ఆటోమేషన్ ద్వారా గిగ్ వర్కర్లు ఉపాధి కోల్పోతే దేశ ఆర్థిక వృద్ధిపై తీవ్ర ప్రభావం పడుతుందని ఆర్థికవేత్తలు హెచ్చరిస్తున్నారు. కోట్ల మంది ఎంతో కష్టపడి పనిచేస్తున్నా..ఎదుగూబొదుగూ లేని ఆర్థికవ్యవస్థనే మనం నిర్మిస్తున్నామా అని వారు ప్రశ్నిస్తున్నారు.

# చంద్రయాన్ 3 దిశగా అడుగులు

## 2027లో గగన్ యాన్

బెంగళూరు, : చంద్రుడి నుంచి మట్టి శాంపిల్స్ తీసుకువచ్చేందుకు 2028లో చంద్రయాన్-4 మిషన్ ను చేపట్టనున్నట్టు ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్(ఇస్రో) చైర్మన్ వి.నారాయణన్ వెల్లడించారు. 2035 నాటికి భారత్ సొంత స్పేస్ స్టేషన్‌ను కూడా నిర్మించుకోనుందని ప్రకటించారు. 2027లో చేపట్టే గగన్ యాన్ మానవ సహిత అంతరిక్ష యాత్ర షెడ్యూల్- లో ఎలాంటి మార్పు లేదన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో మరో 7 రాకెట్ ప్రయోగాలు చేపట్టనున్నట్టు తెలిపారు. ఈ ఏడాది చేపట్టే ప్రయోగాల్లో పూర్తి స్వదేశీ పరికరాలతో రూపొందించిన పీఎస్ఎల్వీ రాకెట్, ఒక కమర్షియల్ కమ్యూనికేషన్ శాటిలైట్ మిషన్, మరికొన్ని పీఎస్ఎల్వీ, జీఎస్ఎల్వీ మిషన్లు కూడా ఉన్నాయని తెలిపారు. చంద్రయాన్-4 మిషన్ కు కేంద్రం ఆమోదం తెలిపిందని, ఇది ఇస్రో చరిత్రలోనే అత్యంత క్లిష్టమైన మిషన్‌గా నిలుస్తుందన్నారు. 2028లో ఈ మిషన్?ను చేపడతామన్నారు. ప్రస్తుతం చంద్రుడి నుంచి మట్టి శాంపిల్స్‌ను తీసుకురాగలిగే సత్తా అమెరికా, రష్యా, చైనాకే ఉందని, ఈ మిషన్ సక్సెస్ అయితే భారత్ వాటి సరసన చేరుతుందన్నారు. చంద్రుడి దక్షిణ ధ్రువంపై వాటర్ ఐస్‌పై అధ్యయనం కోసం జపాన్ ఏరోస్పేస్ ఎక్స్ ప్లొరేషన్ ఏజెన్సీతో కలిసి 'లూపెక్స్' మిషన్ కూడా చేపట్టనున్నట్టు వెల్లడించారు. ప్రస్తుతం అమెరికా, తదితర దేశాల నేతృత్వంలోని ఐఎస్ఎస్, చైనాకు చెందిన తియాంగాంగ్ స్పేస్ స్టేషన్లు మాత్రమే ఉన్నాయని, భారత్ కూడా 2035 నాటికి సొంత స్పేస్ స్టేషన్ ను ఏర్పాటు చేసుకోనుందని ఇస్రో చైర్మన్ తెలిపారు. ఇందుకోసం ఇప్పటికే పనులను ప్రారంభించామన్నారు. 2028 నాటికల్లా తొలి 5 మాడ్యూల్స్?ను కక్ష్యలోకి చేరుస్తామన్నారు. మానవ సహిత మిషన్ చేపట్టడానికి ముందు నిర్వహించే మానవ రహిత మిషన్ల షెడ్యూల్ ను మాత్రమే మార్చామన్నారు. వీటిని ఈ ఏడాదిలోనే పూర్తి చేస్తామని, షెడ్యూల్ ప్రకారం 2027లో మానవ సహిత మిషన్ ఉంటుందన్నారు. 2040 నాటికి చంద్రుడిపైకి భారత ఆస్ట్రోనాట్లను పంపే దిశగా పని చేయాలని ప్రధాని మోదీ ఇస్రోకు సూచించారని




తెలిపారు.గ్లోబల్ స్పేస్ ఎకానమిలో ఇండియాకు ప్రస్తుతం 2 శాతం వాటా (8.2 బిలియన్ డాలర్లు) ఉందని, 2030 నాటికి దీనిని 8 శాతం(44 బిలియన్ డాలర్లు)కు పెంచాలని టార్గెట్ పెట్టుకున్నట్టు నారాయణన్ తెలిపారు. ప్రస్తుతం గ్లోబల్ స్పేస్ ఎకానమీ 630 బిలియన్ డాలర్ల మేరకు ఉందని, 2035 నాటికి ఇది 1.8 ట్రిలియన్ డాలర్లకు చేరుతుందన్నారు. దేశంలో కొన్నేండ్ల క్రితం స్పేస్ సెక్టార్ లో కేవలం 3 స్టార్టప్ లే ఉండేవని, కేంద్రం 2020లో తెచ్చిన సంస్కరణల ఫలితంగా 450 ఇండస్ట్రీలు, 330 స్టార్టప్ లు ఇప్పుడు యాక్టివ్ గా పని చేస్తున్నాయన్నారు. డిమాండ్ కు తగ్గట్టుగా వచ్చే మూడేండ్లలో స్పేస్ క్రాఫ్ట్ ల ఉత్పత్తిని కూడా మూడు రెట్లకు పెంచుతామన్నారు.

# వాటా తేలే వరకు బీసీ జేఏసీ ఉద్యమం ఆగదు

**– బీసీ జేఏసీ జిల్లా చైర్మన్ దాసరి ఉష**




పెద్దపల్లి:రాష్ట్రంలో బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు సాధించుకోవాలనే బలమైన సంకల్పంతో బీసీ జేఏసీని ఏర్పాటు చేసుకున్నా మని, ఇందులో భాగంగానే పెద్దపల్లి జిల్లా చైర్మన్‌గా తనకు బాధ్యతలు అప్పగించారని బీసీ జేఏసీ జిల్లా చైర్మన్ దాసరి ఉష తెలిపారు. పెద్దపల్లి జిల్లా బీసీ జేఏసీ కమిటీ నిర్మాణ సమావేశాన్ని జిల్లా కేంద్రంలోని మూన్ ఫంక్షన్ హాల్ లో నిర్వహించా రు. ఈ సందర్భంగా బీసీ జేఏసీ జిల్లా చైర్మన్ దాసరి ఉష మాట్లాడుతూ గ్రామ పంచాయ తీ ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు పార్టీల వారీగా ఇస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చేసిన ప్రకటనను ఆమె తీవ్రంగా విమర్శించారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పార్టీ గుర్తులు ఉండవని, అలాంటప్పుడు రిజర్వేషన్లు ఎలా అమలు చేస్తారని ఆవెు ప్రశ్నించారు.ఇప్పటికే ఉన్న 27 శాతం రిజర్వేషన్ కూడా సరిగా అమలు కాకపోవడానికి కోర్టు తీర్పులే కారణమని, సుప్రీంకో ర్టు, హైకోర్టులు, ఐఐటీలలో ఓసీ వర్గానికే ఆధిపత్యం ఉందని, వారు తమకు నచ్చినట్టుగా తీర్పులిస్తున్నార ని మండిపడ్డారు. బీసీ రిజర్వే షన్ల కోసం దశాబ్దాలుగా పోరాటం చేస్తున్నా న్యాయం జరగడం లేదన్నారు. కానీఎవరూ అడగకుండానే ఓసీ వర్గా నికి10 శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు ఎలా ఇచ్చారని నిలదీశారు. ఆర్.కృష్ణయ్య, జాజుల శ్రీనివాస్ వంటి నాయకులు చేసిన సుదీర్ఘ పోరాటాన్ని గుర్తుచేస్తూ, గతంలో తమకు మద్దతు ఇస్తామని చెప్పి ఇప్పుడు మౌనంగా ఉన్న అన్ని రాజకీయ పార్టీలను ప్రశ్నించారు. ఈ అంశాన్ని షెడ్యూల్ 9లో పెట్టడానికి ఎందుకు ప్రయత్నించడం లేదని నిలదీసిన ఆమె,

రానున్న రోజుల్లో ఈ ఉద్యమం మరింత బలపడుతుం దని, తమ 42 శాతం వాటా వచ్చేంత వరకు పోరాటం ఆపేది లేదని అన్ని పార్టీలను హెచ్చరించారు. ఈ సమావేశం లో బీసీ జేఏసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నల్లవెల్లి శంకర్,జిల్లా వైస్ చైర్మన్ కొండి సతీష్,జిల్లా కన్వీనర్ సలేంద్ర కొమరయ్య యాదవ్,మంద భాస్కర్ యాదవ్,మీడియా ఇన్చార్జిగా అబ్దుల్ మాలిక్, బీసీ నాయకు లు నోముూరి శ్రీధర్, బొడ్డుపల్లి లక్ష్మణ్,యుగేందర్, నార్ల అంజయ్య, గొల్లపల్లి రాజమ ల్లు, బొంకూరి ఐలయ్య, ఏ.అరుణ,శారద,రవీందర్, తమ్మడబోయిన రాజ్ కుమార్ యాదవ్,కందుల సదాశివ్, అలువాల రాజేందర్, బోడగుం ట సుభాష్, బొంగోని సదయ్య గౌడ్,కన్నం రమేష్, మహేష్, సురేష్ తోపాటు తదితర బీసీ నాయకులు పాల్గొన్నారు.

# హిందూపురంలో ఏం జరుగుతోంది..




అనంతపురం, :హిందూపురం వైసీపీ ఇంచార్జ్ దీపికా రెడ్డి భర్త వేణు రెడ్డి కార్యాలయంపై టీడీపీ కార్యకర్తలు దాడి చేశారు. ఆయన బాలకృష్ణపై అనుచిత వ్యాఖ్యలు చేశారనిఈ దాడి చేశారు. ఎవరో హైదరాబాద్ లో ఉండే వాడి కాళ్ల కింద బతుకుతున్నాం.. వారికి ఓట్లు వేస్తాం, వారు హైదారబాద్‌లో కూర్చుంటాడు. మనం ఇక్కడ బానిస బతుకులు బతుకుతున్నాం... అని ఆయన వ్యాఖ్యానించారు. వేణురెడ్డి వ్యాఖ్యలపై టీడీపీ కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేసి.. ఆయన కార్యాలయంపై దాడి చేశారు. వేణు రెడ్డి భార్య దీపికారెడ్డి గత ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయారు తమ కార్యాలయంపై దాడి చేశారని వైఎస్ జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. హిందూపురంలోని వైసీపీ కార్యాలయంపై టీడీపీ నాయకులు , బాలకృష్ణ అనుచరులు చేసిన హింసాత్మక దాడి ప్రజాస్వామ్యంపైనే ప్రత్యక్ష దాడి అని మండిపడ్డారు. రాజకీయ పార్టీలు కార్యాలయాలను ధ్వంసం చేయడం, ఫర్నిచర్ పగలగొట్టడం, గాజు అద్దాలను పగలగొట్టడం, కార్యకర్తలపై భౌతికంగా దాడి చేయడం ప్రజాస్వామ్య నిబంధనల ప్రమాదకరమైన పతనాన్ని సూచిస్తుందని జగన్ అన్నారు. పోలీసులు పట్టించుకోకపోవడం మరింత ఆందోళనకరంగా ఉందన్నారు.చంద్రబాబు నాయుడు రాజకీయ ఎజెండా కోసం ఆంధ్రప్రదేశ్ శాంతిభద్రతల యంత్రాంగాన్ని బహిరంగంగా దుర్వినియోగం చేస్తున్నారనే దానికి ఇది సూచికన్నారు. హిందూపురంలో టీడీపీ అల్లరిమూకలను ఎలా ప్రోత్సహిస్తున్నారో.. అల్లర్ల ద్వారా రాజకీయ వ్యతిరేకతను అణిచివేయడానికి ప్రయత్నిస్తుందో స్పష్టంగా చూపిస్తుందన్నారు. తన ప్రత్యర్థుల ప్రాథమిక ప్రజాస్వామ్య హక్కులను రక్షించలేని ప్రభుత్వానికి పాలన గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని విమర్శించారు. ఈ దాడిని మేము తీవ్రంగా ఖండిస్తున్నాము. ఇది వైసీపీ పై మాత్రమే కాదు, ప్రజాస్వామ్యం, రాజకీయ స్వేచ్ఛను విశ్వసించే ప్రతి పౌరుడిపైనా ఉందన్నారు .బాలకృష్ణ ఎక్కువగా నియోజకవర్గంలో ఉండరని ప్రచారం చేస్తూ.. ఆయనపై అనుచిత వ్యాఖ్యలు చేయడంతోనే దాడులు చేసినట్లుగా టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. ఈ అంశంపై ఇంకా బాలకృష్ణ స్పందించలేదు. **తెరపైకి లోకల్ అస్త్రం:** హిందూపురంలో లోకల్ నినాదం తేవాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ భావిస్తున్నట్లు కనిపిస్తోంది. ఈ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీకి కంచుకోట. పార్టీ ఆవిర్భావం నుంచి టిడిపి గెలుపొందుతూ వస్తోంది. ఇక్కడ టిడిపిని మట్టి కరిపించాలని ప్రత్యర్థులు చేసే ప్రయత్నాలు ఏవి ఫలించలేదు. ఈ నియోజకవర్గంలో టిడిపికి బలమైన పునాది ఉంది. దీని వెనుక నందమూరి కుటుంబం కృషి ఉంది. ఈ నియోజకవర్గ నుంచి నందమూరి తారక రామారావు ప్రాతినిధ్యం వహించారు. అటు తరువాత హరికృష్ణ ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ఇదే నియోజకవర్గం నుంచి హ్యాట్రిక్ విజయం సాధించారు నందమూరి బాలకృష్ణ. ఎన్నెన్నో రకాల ప్రయత్నాలు చేస్తున్నా విపక్షాలకు హిందూపురం నియోజకవర్గం చిక్కలేదు. 2024 ఎన్నికల్లో సైతం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ దారుణంగా ఓడిపోయింది. అయితే ఇప్పుడు వైసీపీ లోకల్ నినాదం తేవాలన్న ప్రయత్నంలో ఉన్నట్టు కనిపిస్తోంది.చిత్ర పరిశ్రమలో కొనసాగుతూనే రాజకీయాల్లో కూడా రాణిస్తున్నారు బాలకృష్ణ. హిందూపురం శాసనసభ్యుడిగా మూడుసార్లు ప్రాతినిధ్యం వహించిన ఆయన సినిమాలను కూడా కొనసాగిస్తున్నారు. అయితే నియోజకవర్గ విషయంలో మాత్రం ప్రత్యేక దృష్టితో ఉంటారు. ప్రతి రెండు మూడు నెలలకు ఒకసారి తప్పకుండా పర్యటనలు చేస్తారు. మరోవైపు ఇటీవల బాలకృష్ణ సతీమణి వసుంధర సైతం ఎక్కువగా నియోజకవర్గానికి వస్తున్నారు. అభివృద్ధి కార్యక్రమాల్లో పాలుపంచుకుంటున్నారు. అటువంటి నియోజకవర్గంలో బాలకృష్ణ హవా చూస్తున్న ప్రత్యర్థులు హడలెత్తిపోతున్నారు. ఈ క్రమంలో అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారు. తాజాగా నందమూరి బాలకృష్ణ పై హిందూపురం నియోజకవర్గం వైసీపీ ఇన్చార్జ్ వేణు రెడ్డి సంచలన కామెంట్స్ చేశారు. దీంతో వేణు రెడ్డి కార్యాలయం పై టిడిపి శ్రేణులు దాడి చేసే దాకా పరిస్థితి వచ్చింది.గత ఎన్నికల్లో దీపిక రెడ్డి అనే మహిళ నేతను రంగంలోకి దించింది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. చాలా సమీకరణలను వడబోసి దీపిక రెడ్డి సరిపోతారని భావించి ఆమెను పోటీలో పెట్టారు. అయితే ఆమె కనీసం బాలకృష్ణ కు పోటీ ఇవ్వలేకపోయారు. అయితే ఇప్పుడు తాజాగా నియోజకవర్గ వైసిపి ఇన్చార్జిగా ఉన్న వేణు రెడ్డి మీడియా ముందుకు వచ్చి మాట్లాడారు. హైదరాబాదు నుంచి ఎవడో ఏలుతున్నాడని..

ఇంకెన్నాళ్లు ఈ బానిస బతుకులు అంటూ చేసిన వ్యాఖ్యలు టిడిపి శ్రేణులను ఆగ్రహం తెప్పించాయి. దీంతో వేణు రెడ్డి కార్యాలయం పై దాడి జరిగింది. దీనిపై వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆందోళన వ్యక్తం చేస్తోంది. జగన్మోహన్ రెడ్డి సైతం ఇంగ్లీషులో ట్వీట్ చేశారు. టిడిపిని రెచ్చగొట్టి.. శాంతిభద్రతల విఘాతంతో పాటు తప్పుడు ప్రచారం చేసేందుకు దీనిని ఒక ప్రయత్నం గా మలుచుకున్నట్లు తెలుస్తోంది. వాస్తవానికి గత ఎన్నికల్లో బాలకృష్ణను ఓడించేందుకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చేయని ప్రయత్నం లేదు.

ఈ క్రమంలో అనేక ప్రయోగాలు చేసి చేతులు కాల్చుకున్నారు. 2024 ఎన్నికల్లో నందమూరి బాలకృష్ణ ఓడించేందుకు సీనియర్ నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి బాధ్యతలు అప్పగించారు జగన్మోహన్ రెడ్డి. 2019లో జగన్ ప్రభంజనంలో సైతం బాలకృష్ణ గెలిచేసరికి వైసిపి కి మైండ్ బ్లాక్ అయింది. అందుకే 2024 ఎన్నికల్లో నందమూరి బాలకృష్ణ గెలవకూడదని జగన్ భావించారు. ఆ బాధ్యతను సీనియర్ నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి అప్పగించారు. ఆయన తన సొంత నియోజకవర్గ పుంగనూరును కాదని హిందూపురంపై ఎక్కువగా దృష్టి పెట్టారు. అయినా సరే ఫలితం లేకపోయింది. అయితే ఇప్పుడు బాలకృష్ణ పై తప్పుడు ప్రచారాలకు వైసీపీ దిగుతుండడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఇదంతా రెచ్చగొట్టడంలో భాగమేనని కామెంట్స్ వినిపిస్తున్నాయి.

## ఇక రైల్వే స్టేషన్లలో

# కేఎఫ్‌సీ, మెక్ డొనాల్డ్స్

**బ్రాండెడ్ ఫుడ్ ఔట్‌లెట్లకు అనుమతి**




న్యూఢిల్లీ: మెక్ డొనాల్డ్స్, కేఎఫ్‌సీ, పిజ్జా హట్, బాస్కిన్ రాబిన్స్, బికనేర్‌వాలా, హల్దీరామ్స్ వంటి మేజర్ ఫుడ్ చెయిన్స్ ఇక రైల్వే స్టేషన్లలో కొలువుతీరనున్నాయి. దేశవ్యాప్తంగా అన్ని రైల్వే స్టేషన్లలో ఈ ఫుడ్ కోర్టులు వెలిసేందుకు రంగం సిద్ధమైంది. దక్షిణ మధ్య రైల్వే నుంచి వచ్చిన ఈ ప్రతిపాదనకు ఆమోదం లభించింది. రైల్వే బోర్డుకు చెందిన క్యాటరింగ్ పాలసీలో సంస్కరణలకు శ్రీకారం జరిగింది. 2025 నవంబర్ 13నజారీచేసిన సర్క్యులర్‌లో రైల్వే బోర్డు ఈ మేరకు జోనల్ అధికారులకు ఆదేశాలిస్తూ డిమాండు, స్థలం అవసరాల మేరకు ప్రముఖ సింగిల్‌బ్రాండ్ ఫుడ్ ఔట్‌లెట్లను త్వరితంగా అనుమతించాలని పేర్కొంది. ఇవి కంపెనీ ఆధ్వర్యంలో లేదా ఫ్రాంచైజెస్ ద్వారా నిర్వహించాలని, అయితే ఎంపిక మాత్రం ప్రస్తుతం ఉన్న ఈ-వేలం విధానం ద్వారా మాత్రమే ఉండాలని పేర్కొంది.


# సినిమా..

## నా పేరుతో ఎవరో మెసేజులు పంపుతున్నారు..



నటి అదితి రావు హైదరీ సోషల్ మీడియాలో తన పేరుతో జరుగుతున్న మోసాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం పలు దేశీయ, పాన్ ఇండియా ప్రాజెక్టులతో బిజీగా ఉన్న అదితి, పెళ్లి తర్వాత కూడా తన క్రేజ్ ఏ మాత్రం తగ్గలేదని నిరూపిస్తూనే ఉంది. తరచూ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే ఆమె, తాజాగా వాట్సాప్‌లో తన ఫోటోలను ఉపయోగిస్తూ ఫేక్ అకౌంట్లు సృష్టిస్తున్నారని వెల్లడించారు. అదితి షేర్ చేసిన స్క్రీన్‌షాట్‌లో, ఒక వ్యక్తి ఆమె పేరు, ఫోటోలను ఉపయోగిస్తూ ఫోటోగ్రాఫర్లకు ఫోటోషూట్ల పేరుతో మెసేజులు పంపుతున్నట్లు కనిపించింది. ఈ విషయం తెలిసిన వెంటనే ఇన్‌స్టాగ్రామ్‌లో క్లారిటీ ఇస్తూ అభిమానులను అప్రమత్తం చేశారు. ఈ రోజు కొంతమంది నాకు చెప్పిన విషయాన్ని మీతో పంచుకుంటున్నాను. వాట్సాప్‌లో నా ఫోటోలను ఉపయోగిస్తూ ఎవరో 'ఫోటోషూట్' కోసం మెసేజులు పంపుతున్నారు. అవి నేను పంపినవి కావు. నేను ఎప్పుడూ నా పర్సనల్ నంబర్‌ను వర్క్ కోసం ఉపయోగించను. నా అధికారిక పనులు అన్నీ నా టీమ్ ద్వారానే జరుగుతాయి. అలాంటి మెసేజులు వస్తే వెంటనే నా arhconnect టీమ్‌కి తెలియజేయండి. నాకు ఎప్పుడూ అండగా నిలిచే అభిమానులకు ధన్యవాదాలు," అని అదితి పోస్ట్‌లో పేర్కొన్నారు. ఇటీవల పలువురు సెలబ్రిటీలు సోషల్ మీడియా ఫేక్ అకౌంట్లతో మోసాలకు గురవుతున్న సందర్భంలో, ఇప్పుడు అదితి పేరు, ఫోటోలతో కూడా మోసగాళ్లు దోపిడీకి ప్రయత్నాలు చేస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. అభిమానులు, ఫోటోగ్రాఫర్లు ఇలాంటి నకిలీ మెసేజులను నమ్మవద్దని ఆమె స్పష్టం చేశారు. ఇక అదితి రావు హైదరి కొద్ది రోజు క్రితం సిద్ధార్థ్‌ని ప్రేమించి పెళ్లి చేసుకున్న విషయం తెలిసిందే. ఈ జంట ప్రస్తుతం వైవాహిక జీవితంతో పాటు ప్రొఫెషనల్ లైఫ్‌ని బ్యాలెన్స్ చేస్తూ దూసుకు పోతుంది. అదితి అప్పుడప్పుడు సోషల్ మీడియాలో హాట్ హాట్ ఫొటోలు షేర్ చేస్తూ కాక రేపుతూ ఉంటుంది.

## ఆ మూడింటి ఆత్మే అఖండ 2




అగ్ర కథానాయకుడు నందమూరి బాలకృష్ణ నటించిన మోస్ట్ ఎవైటెడ్ డివైన్ పానిండియా యాక్షన్ డ్రామా 'అఖండ 2: తాండవం'. బ్లాక్‌బస్టర్ 'అఖండ'కు సీక్వెల్‌గా ఈ సినిమా వస్తున్నది. సంయుక్త మీనన్, ఆది పినిశెట్టి, హర్షాలి మల్హోత్రా కీలక పాత్రధారులు. బోయపాటి శ్రీను దర్శకుడు. రామ్ ఆచంట, గోపీచంద్ ఆచంట నిర్మాతలు. ఎం.తేజస్వినీ నందమూరి సమర్పకురాలు. డిసెంబర్ 5న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్నది. ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన బిగ్ రివీల్ ఈవెంట్‌లో ఈ సినిమాను 3డీ ఫార్మాట్‌లోనూ విడుదల చేయనున్నట్టు మేకర్స్ ప్రకటించారు. ఇందులో భాగంగా 'అఖండ 2' 3డీ టీజర్‌ని కూడా విడుదల చేశారు. దర్శకుడు బోయపాటి శ్రీను మాట్లాడుతూ 'బాలకృష్ణగారి అభిమానులకు గొప్ప అనుభూతినివ్వాలనే తలంపుతోనే ఈ సినిమాను 3డీ ఫార్మాట్‌లోనూ తెస్తున్నాం. ఈ సినిమాను త్రీడీలో చూసి అద్భుతంగా ఫీల్ అవుతారు. ప్రపంచదేశాల్లో మతం కనిపిస్తుంది. మన దేశంలో మాత్రమే ధర్మం కనిపిస్తుంది. దాని ఆధారంగా తీసిన సినిమా ఇది. ఇంటిల్లిపాదినీ ఈ సినిమాతో ఆనందింపజేసే బాధ్యత నాది. ఇది నేను మీకిస్తున్న హామీ. దేశమంతా చూడాల్సిన సినిమా కాబట్టే ప్రచారం ముంబై నుంచి మొదలుపెట్టాం. భగవద్గీత, రామాయణం, భారతం ఈ మూడింటి ఆత్మే 'అఖండ 2." అన్నారు. విజువల్‌గా అందరికీ అద్భుతమైన ఎక్స్‌పీరియన్స్ ఇచ్చే సినిమా 'అఖండ 2' అని నిర్మాత గోపీ ఆచంట చెప్పారు. ఇంకా డీఓపీ సంతోష్, ఏస్ త్రీడీ రాజు, ఎడిటర్ తమ్మిరాజు, కమెడియన్ రచ్చ రవి కూడా మాట్లాడారు.


## నటి కీర్తి సురేశ్‌కు అరుదైన గౌరవం



ప్రముఖ నటి కీర్తి సురేశ్‌కు అరుదైన గౌరవం లభించింది. ఐక్యరాజ్య సమితికి చెందిన యూనిసెఫ్ (యునైటెడ్ నేషన్స్ఇంటర్నేషనల్ చిల్డ్రన్స్ ఎమర్జెన్సీ ఫండ్) ఇండియా విభాగానికి ఆమె సెలబ్రిటీ అడ్వకేట్‌గా నియమితులయ్యారు. ఈ కొత్త బాధ్యతలు చేపట్టడం పట్ల కీర్తి సురేశ్ హర్షం వ్యక్తం చేశారు. ఇది తనకు దక్కిన గొప్ప గౌరవంగా భావిస్తు న్నానని ఆమె తెలిపారు. ఈ నియామకంపై యూనిసెఫ్ ఇండియా ప్రతినిధి సింథియా మెక్‌కాఫ్రీ మాట్లాడుతూ..“కీర్తి సురేశ్ తో భాగస్వా మ్యం కుదుర్చుకోవడం మాకు ఎంతో సంతోషంగా ఉంది. ప్రేక్షకులతో ఆమెకున్న బలమైన అనుబంధం, పిల్లలహక్కులు, వారి శ్రేయస్సు కోసం పోరాడటానికి బలమైన వే దిక అవుతుందని విశ్వసిస్తున్నాం” అనిఆమె పేర్కొన్నారు. “ప్రతి చిన్నారికి సంతోషంగా, ఆరోగ్యంగా జీవించే హక్కు ఉంది. వారి నేపథ్యంతో సంబంధం లేకుండా, ప్రతి ఒక్కరూ అభివృద్ధి చెందేలా అవగాహన కల్పించేందుకు యూనిసెఫ్ ఇండియాతో చేతులు కలపడం గౌరవంగా ఉంది” అని కృతజ్ఞతలు తెలిపారు. పిల్లల శ్రేయస్సే దేశానికి పునాది అని తాను బలంగా నమ్ముతానని ఆమె వివరించారు. ఇక కీర్తి సినిమాల విషయానికొస్తే.. ప్రస్తుతం ఆమె నటించిన 'రివాల్వర్ రీటా' చిత్రం ఈ నెల 28న విడుదలకు సిద్ధమవుతోంది.

## తెలుగులోకి ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ డ్రామా 'మఫ్టీ పోలీస్'




యాక్షన్ కింగ్ అర్జున్ సర్జ, ఐశ్వర్య రాజేష్‌ల పోలీస్ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ డ్రామా 'తీయవర్ కులై నడుంగ'. ఈ సినిమా తెలుగులో 'మఫ్టీ పోలీస్'గా ఈనెల 21న ప్రేక్షకుల ముందుకు రానుంది. దినేష్ లక్ష్మణన్ దర్శకత్వంలో జియస్టార్ అర్ట్స్ బ్యానర్‌పై జి. అరుల్ కుమార్ నిర్మించిన ఈ తమిళ చిత్రాన్ని...

తెలుగులో ప్రముఖ నిర్మాత ఎ. ఎన్. బాలాజీ శ్రీలక్ష్మిజ్యోతి క్రియేషన్స్ ద్వారా విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మిజ్యోతి క్రియేషన్స్ అధినేత ఎ. ఎన్. బాలాజీ మాట్లాడుతూ... 'యాక్షన్ కింగ్ అర్జున్, ఐశ్వర్య రాజేష్‌లకు తెలుగునాట ఉన్న క్రేజ్‌ని దృష్టిలో పెట్టుకుని అత్యధిక థియేటర్లలో 'మఫ్టీ పోలీస్' చిత్రాన్ని విడుదల చేస్తున్నాం. ఈ సినిమాలో యాక్షన్‌తోపాటు పర్సనల్ డ్రామా కూడా చాలా ఆసక్తికరంగా ఉంటుంది. తమిళంతోపాటు తెలుగులోనూ అసాధా రణ విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది. ఈ చిత్రాన్ని తెలుగు ప్రేక్షకులకు అందించే అద్భుత అవకాశాన్ని నాకు అందించిన జి.అరుల్ కుమార్‌కి, ఈ చిత్రాన్ని అత్యద్భుతంగా తీర్చిదిద్దిన దర్శకుడు దినేష్ లక్ష్మణన్‌లకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు' అన్నారు. ఇందులో రామ్ కుమార్ గణేశన్, అభిరామి వెంకటాచలం, ప్రవీణ్ రాజా తదితరులు కీలక పాత్రల్లో నటించారు.

## సినీ ఇండస్ట్రీలో 50 ఏళ్లు పూర్తి.. రజినీకాంత్, బాలకృష్ణకు అరుదైన గౌరవం





ప్రముఖ స్టార్ నటులు రజినీకాంత్, బాలకృష్ణ కు అరుదైన గౌరవం దక్కింది. సినీ ఇండస్ట్రీలో 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా వీరిద్దరినీ ఘనంగా సన్మానించనున్నట్లు కేంద్ర మంత్రి తాజాగా వెల్లడించారు. ఈ ఏడాది గోవా వేదికగా జరగనున్న 56వ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా వేడుకల్లో వీరిని సత్కరించనున్నట్లు కేంద్ర సమాచార ప్రసారశాఖ సహాయ మంత్రి ఎల్.మురుగన్ తెలిపారు. గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ సమక్షంలో జరిగిన సమావేశం అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఈ విషయాన్ని వెల్లడించారు. 'సినిమా రంగంలో 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్నందుకు దిగ్గజ నటులు రజినీకాంత్, నందమూరి బాలకృష్ణలను సత్కరించనున్నాం. అద్భుతమైన నటనతో దశాబ్దాలుగా వారు ఎన్నో మంచి కథలను ప్రేక్షకులకు అందించారు. భారతీయ సినిమా పట్ల వారి కృషి, సహకారానికి గుర్తింపుగా ముగింపు వేడుకల్లో వారిని సత్కరించనున్నాం. ఇది భారతీయ సినిమా రంగంలోనే ఒక మైలురాయి' అని ఎల్.మురుగన్ తెలిపారు. కాగా, సినీ రంగంలో ప్రతిష్ఠాత్మకంగా భావించే 'ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా' అవార్డుల వేడుక నవంబర్ వరకూ గోవా వేదికగా జరగనుంది. ఈ వేడుకలకు పలువురు సినీ ప్రముఖులు హాజరుకానున్నారు. రజినీకాంత్ ఇటీవలే లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో 'కూలీ' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెలిసిందే. ఈ చిత్రంలో నాగార్జున, సౌబిన్ షాహిర్,శ్రుతి హాసన్, రచితా రామ్, ఉపేంద్ర, ఆమీర్ ఖాన్ వంటి ప్రముఖ నటులు నటించారు. తలైవా ప్రస్తుతం నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వం వహిస్తున్న 'జైలర్ 2'లో నటిస్తున్నారు. మరోవైపు టాలీవుడ్ మరో స్టార్ బాలకృష్ణ ప్రస్తుతం 'అఖండ 2 : తాండవం' చిత్రంలో నటిస్తున్నారు. ఈ చిత్రం వచ్చే నెల ప్రేక్షకుల ముందుకు రానుంది.



## భీమ్లానాయక్ భామతో బాలకృష్ణ స్టెప్పులు

టాలీవుడ్ హిట్ కాంబినేషన్స్‌లో టాప్‌లో ఉంటారు బాలకృష్ణ బోయపాటి శీను. ఈ ఇద్దరి కలయికలో వస్తోన్న సీక్వెల్ ప్రాజెక్ట్ అఖండ 2. తెలుగుతోపాటు పాన్ ఇండియా ప్రేక్షకులు ఆసక్తికరంగా ఎదురుచూస్తున్న ఈ చిత్రం డిసెంబర్ 5న ప్రపంచ వ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ఎస్ థమన్ అండ్ బాలయ్య టీం మ్యూజికల్ ప్రమోషన్స్ షురూ చేసింది.తాజాగా మేకర్స్ అఖండ 2 సెకండ్ సింగిల్ జాజికాయ జాజికాయను నలాంచ్ చేస్తున్నట్టు ప్రకటించారు. వైజాగ్‌లోని జగదాంబ థియేటర్‌లో సాయంత్రం 5 గంటల నుంచి సాంగ్ లాంచ్ ఈవెంట్ జరుగనుంది.




ఈ పాటలో భీమ్లానాయక్ ఫేం సంయుక్తామీనన్ బాలకృష్ణతో కలిసి డ్యాన్స్ చేయనుంది. ఈ పాట సినిమాకే హైలెట్‌గా నిలిచిపోయేలా కలర్‌ఫుల్‌గా ఉండబోతున్నట్టు సాంగ్ లుక్ పోస్టర్ క్లారిటీ ఇచ్చేస్తుంది. ఇప్పటికే లాంచ్ చేసిన అఖండ 2 టీజర్ నెట్టింట మిలియన్ల సంఖ్యలో వ్యూస్ రాబడుతూ టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలుస్తోంది. ఇక సీక్వెల్‌లో ఫస్ట్ పార్టుకు మించిన స్కోర్ గూస్ బంప్స్ తెప్పించేలా ఉండబోతుందని ఇప్పటివరకు థమన్ షేర్ చేసిన అప్‌డేట్స్ చెబుతున్నాయి. అఖండ 2ను 14 రీల్స్ ప్లస్ పతాకంపై రామ్ ఆచంట, గోపీచంద్ ఆచంట సంయుక్తంగా నిర్మిస్తున్నారు.

Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana.
Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. rni. no: TELTEL/2023/88215